
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 48

శుక్రవారం 10-5-2024

SIMULTANEOUSLY PRINTED AT KHAMMAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

నిశ్చయంగా, నా ప్రభువు తన దాసులలో తాను కోరినవారికి జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడు మరియు (తాను కోరిన) వారికి మితంగా ఇస్తాడు. మీరు (ఆయన మార్గంలో) ఖర్చుపెట్టేదంతా ఆయన మీకు తిరిగి ఇస్తాడు. ఆయనే సర్వశ్రేష్ఠుడైన జీవనోపాధి ప్రదాత.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 10 మే 2024

భరోసా కావాలి!

పిల్ల పోయినా... పురుటి కంపు పోలేదని ఒక ముతక సామెత. కరోనా అనే మాట క్రమంగా విన మరుగవుతూ వస్తున్నా, దాని ప్రకంపనలు మాత్రం మానవాళిని ఆందోళనకు గురి చేస్తూనే ఉన్నాయి. కరోనా టీకా కోవిషీల్డ్‌పై తాజాగా వస్తున్న వార్తలే అందుకు తార్కాణం. సదరు టీకా తీసుకోవడం వల్ల మనిషిలో రక్తం గడ్డలు కట్టడం, రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గడం (వైద్య పరిభాషలో 'థ్రోంబో సైటోపేనియా సిండ్రోమ్' – టీటీఎస్) లాంటి అరుదైన దుష్ప్రభావాలుంటా యని దాన్ని రూపొందించిన బ్రిటన్ దిగ్గజ ఔషధ సంస్థ ఆస్ట్రాజెనెకా లండన్ కోర్టులో ఒప్పుకుంది. దాంతో గత వారం గందరగోళం మొదలైంది. తాజాగా ప్రపంచవ్యాప్తంగా ఆ టీకాను ఉపసంహరిస్తు న్నట్టు ఆస్ట్రాజెనెకా బుధవారం ప్రకటించడంతో, భారత్‌లో కోవిషీల్డ్‌గా, యూరప్‌లో వాక్స్‌జెవ్రి యాగా అమ్ముడైన కోవిడ్ టీకాపై రచ్చ పరాకాష్ఠకు చేరింది. కరోనా టీకాల భద్రతపై చాలాకాలంగా జరుగుతున్న చర్చలకు తాజా పరిణామాలు యాదృచ్ఛికంగా కొత్త ఊపిరినిచ్చాయి. మన దేశంలో సుప్రీమ్ కోర్ట్ సైతం ఆస్ట్రాజెనెకా టీకాపై వచ్చిన పిటిషన్ విచారణకు అంగీకరించడం గమనార్హం.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే – కోవిడ్ మహమ్మారితో ప్రపంచం అల్లాడుతున్న సమయంలో ప్రజారోగ్యంలో ఆక్స్‌ఫర్డ్ – ఆస్ట్రాజెనెకా టీకా కీలక భూమిక పోషించింది. క్లినికల్ పరీక్షల అనంతరం 2021 జనవరి 4న టీకా తొలి డోస్ వినియోగించారు. ఆ ఒక్క ఏడాదే దాదాపు 250 కోట్ల డోసులు వేశారు. లక్షలాది ప్రాణాలను కాపాడారు. 2021 ప్రథమార్ధంలో భారతదేశంలో డెల్టా వేరియంట్ పెచ్చరిల్లినప్పుడు కూడా ఇదే సంజీవని. ప్రపంచదేశాల మధ్య టీకాల సరఫరాలో చిక్కులున్న ప్పుడూ ఆ మానవతా సంక్షోభ పరిష్కారానికి అందుబాటులో ఉన్న కొన్నిటిలో ఇదీ ఒకటి. ఫైజర్, మోడర్నా, నోవావ్యాక్స్, వగైరాల లానే ఈ టీకా కూడా అనేక స్థాయుల పరీక్షలకు లోనైంది. మూడు విడతల ట్రయల్స్‌లో వేలాది ప్రజలపై పరీక్షలు చేసి, సురక్షితమనీ, ప్రభావశీలమనీ తేలాకనే అను మతులిచ్చారు. బ్రిటన్ సహా యూరప్‌లోని పలు దేశాల్లో 2021 ఆరంభంలో దీన్ని పంపిణీ చేశారు.

నిజానికి, ఈ టీకా వినియోగం వల్ల కొన్ని దుష్ఫలితాలు ఉండవచ్చని బ్రిటన్ ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలోనే చెప్పింది. కానీ, ప్రపంచవ్యాప్తంగా వారానికి 40 లక్షల కొత్త కేసులొస్తూ, కరోనా తీవ్రత భయం రేపుతున్న సమయమది. దిక్కుతోచని ఆ పరిస్థితుల్లో... టీకాతో అరుదుగా వచ్చే ముప్పు కన్నా ఉపయోగాలే ఎక్కువని ప్రపంచ ఆరోగ్య సంస్థ లాంటివి భావించాయి. పైగా, మహిళలు వాడే గర్భనిరోధక మాత్రల లాంటి అనేక ఇతర ఔషధాలతో పోలిస్తే ఈ టీకాతో రక్తం గడ్డలు కట్టే రేటు బాగా తక్కువనీ, ప్రతి వెయ్యిమందిలో ఒక్కరికే ఆ ప్రమాదం ఉంటుందనీ లెక్కల్లో తేల్చారు. అం దుకే, ప్రపంచ క్షేమం కోసం ఈ టీకాను కొనసాగించారు. ఇక, భారత్ సంగతెలా ఉన్నా విదేశాల్లో కరోనా టీకాతో సహా ఏ ఔషధంతో ఇబ్బంది తలెత్తినా బాధితులకు నష్టపరిహార పథకాలున్నాయి. అయితే, అక్కడ కూడా నష్టపరిహారం అందడంలో చిక్కులు ఎదురవడంతో సమస్య వచ్చింది. టీటీఎస్ వల్ల బ్రిటన్‌లో కనీసం 81 మంది చనిపోగా, వందల మంది అనారోగ్యం బారిన పడ్డారు. నష్టపరిహారం కోరుతూ బాధిత కుటుంబాలు కోర్టుకెక్కాయి. అలా దాదాపు 51 కేసులు ఎదుర్కొం టున్న ఆస్ట్రాజెనెకా లండన్‌లోని హైకోర్ట్‌లో తొలిసారిగా టీకా దుష్ప్రభావాలను అంగీకరించింది.

సహజంగానే ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా 175 కోట్లకు పైగా కోవిషీల్డ్ టీకా డోసులు తీసుకున్న మన దేశ ప్రజానీకంలో కలకలం రేపింది. ఒక దశలో లక్షలాది ప్రజానీకాన్ని కాపాడి, ప్రపంచానికి రక్షాకవచంగా కనిపించిన టీకా ఇప్పుడిలా భయాందోళనలకు కారణం కావడం విచిత్రమే. కానీ, ప్రాణాంతక మహమ్మారిని కట్టడి చేసేందుకు మరో మార్గం లేని దశలో ఈ టీకాలే దిక్కయ్యాయని మర్చిపోరాదు. ప్రాణరక్షణ కోసం ప్రపంచంలోని అన్ని ప్రభుత్వాలూ, ఔషధ సంస్థలూ టీకాలను తీసుకురావడంలో కొంత హడావిడి పడివుండవచ్చు. లాభనష్టాలపై ప్రజల్ని మరింత చైతన్యం చేసి, టీకా కార్యక్రమం చేపట్టి ఉండవచ్చు. అయితే, కోట్లాది ప్రాణాలకు ముందుగా ప్రాథమిక భద్రతే ధ్యేయంగా టీకాల వినియోగం త్వరితగతిన సాగిందని అర్థం చేసు కోవాలి. పైగా, టీకా దుష్ప్రభావాలు అత్యంత అరుదుగా కొందరిలోనే కనిపిస్తాయని వైద్య నిపు ణులు ఇప్పటికీ స్పష్టం చేస్తున్నందున అతిగా ఊహించుకొని ఆందోళన చెందడం సరికాదు.

ఆస్ట్రాజెనెకా వారి టీకా మంచిదే అయినా, ఫైజర్, మోడర్నా లాంటి ఇతర టీకాలు మెరుగైనవని నిపుణుల మాట. మరింత భద్రత, ప్రభావశీలత ఉన్న ఎంఆర్ఎన్ఏ వెర్షన్లు ఇప్పుడు అందుబాటు లోకి వచ్చాయి. దానికి తోడు బాధితుల కేసులు. ఫలితంగా, ఆస్ట్రాజెనెకా తన టీకాలను ఉపసంహ రించుకోక తప్పలేదు. కోర్టు కేసులకూ, తమ ఉపసంహరణకూ సంబంధం లేదనీ, రెండూ కాకతాళీ యమేననీ ఆ సంస్థ చెబుతున్నా, ఇదంతా నష్టనివారణ చర్యల్లో భాగంగానే కనిపిస్తోంది. అది అటుం చితే, రోగుల భద్రతే తమ ప్రాధాన్యమని ఆస్ట్రాజెనెకా పునరుద్ఘాటిస్తే సరిపోదు. టీకా వాడకం వల్ల తలెత్తిన ఆరోగ్య సమస్యలకు విరుగుడు ఆలోచించి, ప్రజల్లో భరోసా పెంచాలి. బాధ్యత వహించి, బాధిత రోగులకు సత్వర నష్టపరిహారం చెల్లించి తీరాలి. టీకాలో లోపమెక్కడ జరిగిందో క్షుణ్ణంగా పరిశోధించాలి. ప్రభుత్వాలు సైతం ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి. టీకా వినియోగం సురక్షితమేనని ప్రకటించడానికి అనుసరిస్తున్న ప్రమాణాలేమిటో ఒకసారి సమీక్షించాలి. కఠినమైన ప్రమాణాలు పాటించకుండానే కోవిషీల్డ్ వినియోగానికి పచ్చజెండా ఊపిన నియంత్రణ అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే, ప్రస్తుత పరిణామాలతో ప్రజలకు టీకాల పైన, వాటి తయారీదార్లపైన, చివరకు ఆరోగ్య వ్యవస్థ మీదే నమ్మకం సడలితే అది మరింత ప్రమాదం.

రంగును బట్టి రాజకీయాలా?

విశ్లేషణ



టంకశాల అశోక్

దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లను పోలి ఉంటారన్న శామ్ పిట్రోడా వ్యాఖ్యలపై దుమారం రేగింది. ఆధునిక మానవుని ఆవిర్భావం తొలుత ఆఫ్రికాలోనే జరిగిందనీ, అక్కడి నుంచి వారు వివిధ ప్రాంతాలకు వలస పోయారనీ, అందులో ప్రస్తుత భారతదేశం కూడా ఒకటనీ శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్నారు. అలాంటప్పుడు ఆఫ్రికన్లతో పోలిక ఎవరికైనా ఎందుకంత ఉలికిపాటుకు గురి చేయాలి? వలసలు, సాంకర్యాల క్రమంలో మనుషులు తమ ఒరిజినల్ లక్షణాలలో కొన్నింటిని నిలుపుకొన్నారు, కొన్నింటిని కోల్పోయారు. ఇందుకు అనుగుణంగా దక్షిణ భారతీయుల రంగు ఉత్తరాదివారితో తేడాగా ఉండటం సహజం. ఆ చర్మపు రంగును గురించి, 'వీరంతా ద్రవిడులు' అనే ఈసడింపులు తెలిసిన విషయమే. ఈ విధమైన భావనలు ఏవీ దేశానికి మంచివి కావు.

దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లను పోలి ఉంటా రంటూ శామ్ పిట్రోడా (ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఛైర్మన్‌గా రాజీనామా చేశారు) చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం సాగుతున్నది. రాజకీయాలను పక్కన ఉంచి మానవ వికాస శాస్త్రాన్ని, మానవ వలసల కోణాలను పరిశీలిస్తే ఆ వ్యాఖ్యలలో తప్పే మిటో అర్థం కాదు. వానరాల నుంచి ఆధునిక మానవుని ఆవిర్భావం తొలుత ఆఫ్రికాలోనే జరిగిందనీ, అక్కడి నుంచి వారు భూగోళంలోని వివిధ ప్రాంతాలకు వలస పోయారనీ, అందులో ప్రస్తుత భారతదేశం కూడా ఒకటనీ శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్నారు. ఈ సూత్రీకరణను ప్రపంచమంతా కూడా ఆమోదిస్తున్నది. మనకు మాత్రం సైన్సు కన్నా రాజకీయాలు ముఖ్యం గనుక పిట్రోడా మాటలపై భూమ్యాకాశాలను ఏకం చేసే హంగామాను సృష్టిస్తున్నాము.

ఇంతకూ పిట్రోడా అన్నదేమిటి? ఆయన దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లను పోలి ఉంటారని మాత్రమే అనలేదు. దేశంలోని తూర్పు ప్రాంతాల వారు చైనీయులవలె, పశ్చిమ ప్రాంతాల వారు అరబ్బుల వలె, ఉత్తరాది వారు శ్వేతజాతీయులవలె ఉంటారని కూడా అన్నారు. ఈ పోలికలలో తక్కిన మూడింటిని వదలి, దక్షిణ భారతీయులు ఆఫ్రికన్ల వలె ఉంటారన్న మాట ఒక్కటే వివాదమైంది. వివాదమైంది అనటంకన్న వివాదంగా మార్చారనటం సరైనదవుతుంది. ఈ చర్చ లోకి వెళ్లే ముందు ఒక విషయం గుర్తు చేసుకోవాలి. స్వయంగా బీజేపీకి చెందిన తరుణ్ విజయ్ అనే నాయకుడు, తను రాజ్యసభ సభ్యునిగా, 'పాంచజన్య' పత్రిక సంపాదకునిగా ఉండినపుడు, ''మనం (అనగా ఉత్తరాది వారం) దక్షిణాది వారితో కలిసి ఉండటం లేదా?'' అని వ్యాఖ్యానించారు. అనగా, తాము తెల్లగా ఉంటామని, ఉత్తమ స్థాయి వారమని, దక్షిణాది వారు నల్లగా ఉంటారని, అధమ స్థాయి వారని, అయినప్పటికీ తమది ఉదార స్వభావం గనుక అటువంటి వారితో కలిసి జీవిస్తున్నామని అర్థం.

వాస్తవానికి దక్షిణాది వారి చర్మపు రంగును గురించి, కను ముక్కుల తీరు గురించి, భాషా సంస్కృతుల గురించి, 'వీరంతా ద్రవి డులు' అనే పద్ధతిలో ఈసడింపులు చేయటం అందరికీ తెలిసిన విషయమే. ఎన్టీఆర్ రాక వరకు అందరూ కట్టగట్టి 'మద్రాసీ'లే. ఈ ధోరణికి బీజేపీ, సంఘ్ పరివార్ సైతం మినహాయింపు కాదన్నది ఇక్కడ గుర్తించవలసిన విషయం. ప్రస్తుత వివాద సందర్భంలోనూ ఈ సంగతి గుర్తించాలి. పిట్రోడా కాంగ్రెస్ నేత అయినందున, ఆయన మాటలను వివాదం చేస్తే తమకు రాజకీయంగా లాభిస్తుందనే సం కుచిత ఆలోచన తప్ప, ఇందులో బీజేపీ వివేకం ఏమీ కన్పించదు.

మనకు తెలిసి మానవ వికాస శాస్త్రం, ప్రపంచవ్యాప్తంగా వలసల చరిత్ర, ఇటీవలి సంవత్సరాలలో జరిగిన డీఎన్ఏ పరిశోధనలు చెప్తున్న విషయాలు కొన్నున్నాయి. ఇండియా, చైనా, ఉత్తర యూరప్‌లలో ప్రాథమిక స్థాయి మానవ జాతులు స్వల్ప స్థాయిలో రూపుదిద్దుకున్న



అండమాన్ దీవుల్లోని అండమానీస్ తెగ ప్రజలు (ఫైల్ ఫొటో)

ప్పటికీ, ఆధునిక మానవుని ఆవిర్భావం తొలుత జరిగింది ఆఫ్రికాలోని తూర్పు భాగాన గల రిఫ్ట్ వ్యాలీలో. వేలాది సంవత్సరాల కాలంలో అటువంటి ఆవిర్భావం ఏ విధంగా జరిగిందో శాస్త్రీయమైన పురావస్తు అధ్యయనాలు చెప్పాయి. వాటిపై కెన్యా రాజధాని నైరోబీ, ఇథియో పియా రాజధాని అడ్డిస్ అబాబాలలోని జాతీయ మ్యూజియాలలో గొప్ప ప్రదర్శనలున్నాయి. ఈ రెండింటినీ నేను స్వయంగా చూడటమే గాక, రిఫ్ట్ వ్యాలీలోని కొంత భాగంలో ప్రయాణించాను. ఆధునిక మానవుని ఆవిర్భావం పరిస్థితి ఇది కాగా, ఆ ప్రాంతం నుంచి మాన వులు రెండు లక్షల సంవత్సరాల క్రితం నుంచి మొదలుకొని ప్రపంచం నలువైపులా ఎట్లా వలస వెళ్లారో, ఆ విధంగా 70 వేల ఏళ్ల క్రితం ప్రస్తుతం మనం అంటున్న భారతదేశంలోకి ఏ విధంగా ప్రవేశించారో అనేక అధ్యయనాలున్నాయి.

తర్వాత వేల సంవత్సరాలలో ప్రపంచమంతటా జరిగినట్లే ఇండియాలో కూడా లెక్కలేనన్ని జాతి సాంకర్యాలు జరిగాయి. పైన చెప్పుకున్నట్లు అప్పటికే ఇక్కడ స్వల్ప స్థాయిలో ప్రాథమిక మానవులు ఉండగా, తర్వాత కాలాలలో తూర్పు ఆసియా నుంచి మంగోలా యిడ్లు, మధ్య ఆసియాలోని కాస్పియన్ సముద్ర ప్రాంతం నుంచి ఆర్యులు, పశ్చిమాసియా నుంచి అరబ్బులు, పారశీకుల పూర్వీకులు ఇటువైపు వలసలు వస్తూ పోయారు. తిరిగి వీరందరి మధ్య సాంక ర్యాలు, వలసలు వేలకు వేల సంవత్సరాల పాటు సాగాయి. దేశం లోని అన్ని ప్రాంతాల స్త్రీ, పురుషుల డీఎన్ఏలపై జరిగిన ఆధునిక శాస్త్ర పరిశోధనలు, పురావస్తు పరిశోధనలు తేల్చిన విషయాలివి. అయితే ఈ వలసలు, సాంకర్యాల క్రమంలో వేర్వేరు జాతులు, ప్రాంతాల మనుషులు తమ ఒరిజినల్ లక్షణాలలో కొన్నింటిని తరతరాలుగా నిలుపుకోవటం, కొన్నింటిని ఒక మేర కోల్పోవటం జరుగుతూ వస్తు న్నదని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఉదాహరణకు అండమాన్, నికో బార్ ఆదివాసి తెగలు, దేశంలోని మారుమూల అడవులలో నివ సించే ఆటవిక జాతులకు ఇతరులతో సాంకర్యం దాదాపు లేనందున, వారిలో ఇప్పటికీ ఆఫ్రికన్ డీఎన్ఏ యథాతథంగా కనిపిస్తుందంటారు. అటువంటి స్థితిలో ఆఫ్రికన్లతో పోలిక ఎవరికైనా ఎందుకంత ఉలికి పాటుకు, వ్యతిరేక భావనకు గురి చేయాలి?

దక్షిణాది ప్రజలు, ఈశాన్య భారత లేదా తూర్పు భారత వాసులు, పశ్చిమ, ఉత్తర ప్రాంతాల వారి రంగు తేడాలకు మూలాలు దీనంతటిలో ఉన్నాయి. దక్షిణ–ఉత్తర భారత భాషలు, సంస్కృతులు, దేవతలు, ఆలోచనా ధారల మధ్య, చివరకు రాజకీయాల మధ్య కనిపించే వ్యత్యాసాలకు గల మూలాలను శాస్త్రీయంగా శోధిస్తూ పోతే బోధపడేది ఇదే. ఆధునిక మానవుల ఆవిర్భావానికి, వారి వలసలకు, పరస్పర సాంకర్యాలకు లక్షలాది, వేలాది సంవత్సరాల చరిత్ర ఉంది. ఇందుకు ప్రపంచంలోని ఏ ప్రాంతంగానీ, భారతదేశంగానీ ఎంత మాత్రం మినహాయింపు కావు. పైన చెప్పుకొన్నట్లు, ఈ పరిణామ క్రమం ఒకవైపు అనంతంగా సాగుతూనే, మరొకవైపు అనేకులు తమ ఒరిజినల్ డీఎన్ఏలోని, ఒరిజినల్ లక్షణాలలోని కొన్ని భాగాలను అదేవిధంగా నిలుపుకొన్నారు. అట్లా ఎవరెంత నిలుపుకొన్నారు, అవి ఏ మేరకు నిలిచి ఉన్నాయనేది అనేక పరిస్థితులపై ఆధారపడి సాగుతూ వస్తున్నది.

ఇందుకు అనుగుణంగా దక్షిణ భారతీయుల రంగు కన్నా ఉత్తరాదివారు, పశ్చిమ, తూర్పువాసుల రంగు తేడాగా ఉండటం సహజం. కానీ దానినిబట్టి వివక్షలు ఏర్పడాలంటే, తక్కిన ముగ్గురి లోనూ ఆఫ్రికన్ డీఎన్ఏ ఉంది. వారి పూర్వీకులు సైతం ఆఫ్రికన్లే. అటువంటపుడు, ఇంకా ఒక మేర మిగిలి ఉన్న రంగును బట్టి తరుణ్ విజయ్ అనే పెద్దమనిషి గానీ, మరొకరుగానీ, తమవంటి పూర్వీకులే గల దక్షిణ భారత ప్రజలను చిన్నచూపు చూడటం విజ్ఞతగల పని అవుతుందా? ఇంతకూ పిట్రోడా ఆ మాటలన్నది ఎందుకో తెలియదు గానీ, మానవ వికాస శాస్త్రం దృష్టితో, ప్రపంచవ్యాప్త వలసల చరిత్ర దృష్టితో, డీఎన్ఏ పరిశోధనల దృష్టితో సరిగా ఇవే మాటలను ఇప్పటికి ఎందరో అన్నారు, రాశారు. ఎన్నికల సమయం గనుక ఇది అధికార పక్షానికి ఒక మంచి ఆయుధంగా మారింది.

ఈ సందర్భంలో మరొకటి గుర్తుకు వస్తున్నది. ఆర్యుల, ఉత్తరాది వారి ఆధిపత్యంగల పార్టీలు, ప్రభుత్వాలు ద్రవిడుల దక్షిణాదిని రాజకీయంగా జయించాలని, తమ ఆధిపత్యం కిందకు తెచ్చుకోవా లని ప్రయత్నిస్తున్నాయని, నిరంతరం వివక్షకు గురి చేస్తున్నాయనే వాదనలు పెరియార్ రామస్వామి తర్వాత, హిందీ వ్యతిరేక, ఉత్తరాది వ్యతిరేక ఉద్యమాల తర్వాత ఇప్పటికీ ముందుకు వస్తుంటాయి. ఈ విధమైన భావనలు ఏవీ దేశానికి మంచివి కావు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వ్యాప్తి లేకనా?



గుప్తుల వంశానికి చెందిన కుమార గుప్తుడు నిర్మించిన అసలైన నలందా విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం బాగుంది. దాని విస్తృతి, సంరక్షణ, విభ్రాంతి గొలిపే తీరు దృష్ట్యా చూస్తే ప్రపంచంలోనే అంతర్జాతీయ యాత్రి కులు అత్యంత తక్కువగా సందర్శించే చారిత్రక ప్రదేశంగా ఇది నిలుస్తుంది.

– ఆండ్రూ ఫ్లెమ్మింగ్, బ్రిటన్ దౌత్యవేత్త

తగ్గినా నెగ్గుతారు!



బీజేపీలో పగుళ్లను గుర్తిస్తూ ప్రతిపక్షం సంబరపడుతుండొచ్చు గాక! కానీ సందేహం లేకుండా బీజేపీ, దాని మిత్రపక్షాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి. వాళ్లు దాని మీద ఏళ్లుగా పనిచేస్తున్నారు. వారి మార్కెటింగ్ వ్యూహం కచ్చితంగా ఉంది. 400 స్థానాలు రాకపోవచ్చు. కానీ ప్రభుత్వమైతే ఏర్పడుతుంది.

– అతుల్ ఖత్రీ, యూట్యూబర్

మతం మారిన గోడలు



హాజియా సోఫియా తర్వాత, టర్కీ అధ్య క్షుడు ఎర్డోగాన్ మరో ప్రాచీన ఆర్థొడాక్స్ చర్చిని మసీదుగా మార్చారు. చర్చి నుంచి మసీదుగా, అటుపై మ్యూజి యంగా మారినదాన్ని మళ్లీ మసీదు చేశారు. ఇంకెక్కడైనా మసీదును ఇస్లా మేతర ప్రార్థనాస్థలంగా మార్చితే ఎర్డో గాన్ కచ్చితంగా కోపోద్రిక్తులవుతారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

మనమే కాపాడుకోవాలి!



ఇజ్రాయెల్‌కు పంపాల్సిన ఆయుధాలను అమెరికా నిలిపి వుంచిందని వార్త. దాదాపుగా తన 51వ రాష్ట్రం లాంటి ఇజ్రాయెల్‌కే అమెరికా అలా చేయగలిగితే, అది ఇండి యాకు ఏం చేయగలదో ఊహించండి. రక్షణ రంగంలో ఆత్మనిర్భరతకు మించిన ప్రత్యామ్నాయం లేదు.

– దివా జైన్, డెవలపర్

కావాలనే...



మనం భరించాల్సి వస్తున్న ఈ ఎండలు, వాతావరణ సంక్షోభం ఏదో ప్రమాదవశాత్తూ సంభవించినవి కాదు: అది ఉద్దేశపూర్వక రాజకీయ ఎంపిక.

– దిశా రవి, యాక్టివిస్ట్

ఆయనకు ప్రజలే దేవుళ్ళు

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ప్రజాస్వామ్య యుగంలో కత్తి ఉన్నవాడిదే రాజ్యం కాదు. ప్రజాబలం ఉన్నవాడిదే రాజ్యం. ప్రజాబలం ఏ నాయకుడికైనా ఓటు ద్వారా లభి స్తుంది. ఓటరు తలచుకుంటే ఎవరినైనా గద్దెనెక్కించగలడు. కాని ఈ ఓట రును అయోమయంలో ముంచి కులమతాలను రెచ్చగొట్టి, సామాజిక అంతరాలను సృష్టించి, డబ్బు ప్రలోభాలు పెట్టి, అబద్ధాలను అనంత సంఖ్యలో ప్రచారం చేసి గెలుద్దామనుకునే చంద్రబాబు నాయుడు లాంటి నాయకులున్నారు. తానిదివరకు పద్నాలుగేళ్ళు ముఖ్యమంత్రిగా ఉండి ప్రజలను ఏమాత్రం పట్టించుకోకుండా నేలవిడిచి సాము చేసినట్లు పాలన చేసిన చంద్రబాబు నాయుడు కాపీ కొట్టిన ఉచితాల పథకంతో, తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మరోసారి మభ్యపెట్టాలని చూస్తున్నారు.

చంద్రబాబుకు జగన్‌ను ఇష్టమున్నట్టు తిట్టడమే మ్యానిఫెస్టో. ఐదేళ్ళ పాలనలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి యాభై ఏళ్ళ భరోసానిచ్చిన జగన్‌ను బదనాం చేయడమే బాబు బృందం పనిగా పెట్టుకుంది. చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా గత ఐదేళ్ళలో జగన్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేసిన మేలు, వాగ్దానాల అమలును ప్రజలు మరచి పోయేట్టు చేయలేకపోతున్నారు. ఇంగ్లీష్ మీడియం నాణ్యమైన చదువులు, ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, నవరత్నాలు, రైతు భరోసా, రుణ మాఫీ, వలంటీర్ వ్యవస్థ, లక్షలాది ఉద్యోగాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, సామాజిక అంత రాల తొలగింపుకై చేస్తున్న కృషి లాంటి వన్నీ జగన్‌ను ఎన్నటికీ ప్రజలు మరచిపోలేని విధంగా మార్చాయి. చంద్రబాబు 14 ఏళ్ళపాలనలో బాబు పేరును జ్ఞాపకం చేసుకోవడానికి వీలున్న ఒక్క పథకమూ లేనందువల్ల ఆయన ఎన్ని ఉచితాలు ప్రకటించినా అవి ఉత్తుత్తివే అని ప్రజలు భావిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాలను ఏలిన ఏ రాజకీయనాయకుడూ సంపాదించనంత ప్రజాదరణను, కీర్తి ప్రతిష్ఠలను జగన్ ఐదేళ్ళలో సంపాదించారు. ఆయనకున్న అసమాన పథక రచనా చాతుర్యం, ప్రజాస్వామ్యంలో పాలకుడు ఇలా ఉండాలన్న విషయంపై ఉన్న క్లారిటీలే అందుకు కారణం. మౌలిక మార్పులు తీసుకురావడంలో, ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఉదాహరణ ప్రాయంగా నిలబెట్టడంలో, సామాజిక న్యాయబాటను సువిశాలం చేయడంలో జగన్ తీసుకున్న చర్యల వల్ల ఈ విజయం సాధ్యమైంది.

మతాన్ని, కులాన్ని సెంటిమెంట్లను రెచ్చగొడుతూ ఓట్లు సంపాదించుకునే మతతత్వ పార్టీలు, సిద్ధాంత ప్రాతిపదిక అంటూ ఏదీ లేకుండా పార్టీలు నడిపే కప్పదాటు నాయకుల సమూహం ఎన్నికల వేళ జగన్‌కు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నాయి. కానీ ప్రజలు వీటిని పట్టించుకోవడం లేదు. జగన్‌కు ఆచరణశీలత ఉంది. ప్రజలను ప్రేమించే గుణముంది. ఆ ప్రజల కోసం ఏమైనా చేసి తీరాలన్న తపనుంది. తండ్రి రాజశేఖరరెడ్డి వారసత్వంగా వచ్చిన 'ప్రజలే దేవుళ్లు' అనే భావముంది. ఆ ప్రజలకు సేవ చేయాలన్న సేవా తత్పరత ఉంది. అందుకే ప్రజ లంతా జగన్ వెంటున్నారు. అప్పుడు వైఎస్సార్‌ను హృదయానికి హత్తుకున్నట్టే ఇప్పుడు జగన్‌ను హత్తుకుంటున్నారు. జగన్ నడిపిస్తున్న వైఎస్సార్ సీపీని ఆంధ్రులు గెలిపించి తీరుతారు. బూటకపు ఉచితాల చంద్రబాబుకిది చివరి ఎన్నిక కావడం ఖాయమని అనేక సర్వేలు చెబు తున్నాయి.

వ్యాసకర్త ప్రముఖ కథారచయిత । 91829 18567

ఎంతకాలం మోసం చేయగలరు?

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీ, ఆర్ఎస్ఎస్ మీద చేసిన నిరాధారమైన అబద్ధాలపై లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉంది. ఆయన చెప్పినవన్నీ అబద్ధాలే. వాటిని ప్రజల ముందు ఉంచాలి. లేకుంటే అవన్నీ నిజా లని నమ్మే ప్రమాదం ఉంది. గత అసెంబ్లీ ఎన్ని కలలో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటే అని తప్పుడు ప్రచారం చేయటం, అలవి కాని తప్పుడు హామీలు ఇవ్వడం ద్వారా అసెంబ్లీ ఎన్నికలలో గెలిచారు. ఆ హామీలు ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల్లో కొత్త అబద్ధాలతో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు.

ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతమే రిజర్వేషన్లు రద్దు చేయడం అని సొంత థియరీ చెప్పడం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనం. ఎందుకంటే ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డా॥ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ సంఘ్ 'విజన్ అండ్ మిషన్'ను స్పష్టంగా చెప్పారు. 'జనతా జనార్దన' అనే భావనను ఆయన చెప్పారు. అనగా 'ప్రజలే దేవుడి అవతారం, ప్రజాసేవ చేయడం అంటే దైవ సేవ చేయటం' అని అర్థం. అటువంటి దైవిక పునాదుల మీద నిర్మితమైన ఆర్ఎస్ఎస్ ఎన్నో తరాలుగా నష్టపోయిన నిరుపేద ఎస్సీ, ఎస్టీ ప్రజలకు ఇచ్చిన, రాజ్యాంగ బద్ధంగా లభించిన రిజర్వేషన్లను రద్దు చేసే ప్రణాళికతో ఉందనడం దేశ ప్రజలను తప్పుదోవ పట్టించటమే అని చెప్పాలి. రాజకీయ పార్టీగా ఎదిగిన బీజేపీ నిరం తరం హిందూ సమాజంలోని అసమానతలను తొలగించి ఒక నూతన భారతాన్ని నిర్మించేందుకు కృషి చేస్తూ వస్తున్నది. అటువంటి బీజేపీ మీద రిజర్వేషన్లు రద్దు చేస్తారనే ఊహాజనితమైన నింద వేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనాన్ని తెలియజేస్తుంది.

ముఖ్యమంత్రి సంఘ్, బీజేపీ నాయకులను అభాసుపాలు చేసేముందు సావర్కర్ హిందూ సమాజంలోని కుల రుగ్మతలకు వ్యతిరేకంగా అప్పట్లోనే నిర్వహించిన 'సహపంక్తి' భోజనాల వంటి కార్యక్రమాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాక బీజేపీ సిద్ధాంతకర్త అయిన దీన్ దయాల్ ఉపాధ్యాయ్ 'అంత్యోదయ', 'ఏకాత్మ మానవతా వాదం' వంటి తాత్విక చింత నల గురించి అధ్యయనం చేసి మాట్లాడి ఉండా ల్సింది. ప్రజాస్వామ్యంలో ఓట్లు పొందాలంటే ప్రజలను మెప్పించే విధానం ప్రజాసేవ మాత్రమే కానీ... రాజకీయ ఆరోపణలు, అబద్ధాలు కావని గుర్తుంచుకోవాలి.

రేవంత్ రెడ్డి మీద వచ్చిన ఫిర్యాదు, నమోదైన కేసు విషయాన్ని పరిశీలిస్తే ఆయన చేస్తున్న వితం డవాదం ఏంటో ఇట్టే అర్థమవుతుంది. కేంద్ర హోం



శాఖ మంత్రి అమిత్ షా మాటల్ని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా రూపొందిం చిన ఒక 'డీప్ ఫేక్' వీడియోకి సంబంధించి ఢిల్లీ పోలీసులు ఆయనకు నోటీస్ జారీచేశారు. అమిత్ షా చాలా స్పష్టంగా మతపరమైన రిజర్వేషన్లు తమ విధానం కాదనీ ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన న్యాయబద్ధమైన వాటాను ముస్లింలకు బదిలీ చేసే ప్రయత్నాలను బీజేపీ అడ్డుకుంటుందనే అర్థంలో మాట్లాడితే దాన్ని మార్చి అసలు ఎస్సీ, ఎస్టీలకు ఉన్న రిజర్వేషన్లను తీసివేస్తామన్న అర్థం వచ్చేలా ఫేక్ వీడియో తయారుచేసి ప్రచారం చేశారు.

రాజ్యాంగ బద్ధమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న రేవంత్ రాజ్యాంగ సమీక్ష కొరకు నియమిం చిన జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్‌ను రాజ్యాం గాన్ని మార్చడానికి వేశారని ఏమాత్రం అవగాహన లేకుండా మాట్లాడటం ఆయన విషయ పరిజ్ఞానా నికి నిదర్శనం. రేవంత్ తూలనాడినట్టుగా బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం ఏనాడూ చేయ లేదు. నిజానికి కాంగ్రెస్ పార్టీనే తరచూ రాజ్యాంగ సవరణలు చేసింది. ఒక్క ఇందిరా గాంధీ కాలం లోనే 42వ రాజ్యాంగ సవరణతో పాటు అనేకసార్లు రాజ్యాంగాన్ని సవరణల పేరుతో తన ఇష్టం వచ్చి నట్టుగా మార్పు చేశారు. రాజ్యాంగ ప్రాథమిక స్వరూపాన్ని మార్చే ఏ హక్కూ పార్లమెంట్‌కు లేదని 'కేశవానంద భారతి' వంటి సుప్రీం కోర్టు తీర్పులు చెబుతుంటే... రేవంత్ రెడ్డి ఇలాంటి అనైతికమైన ఆరోపణలు చేయటం ఆయన స్థాయికి తగదు.

హిందూ మతం నుంచి వేరే మతానికి మారిన వారు కూడా రిజ ర్వేషన్లు అనుభవించడాన్ని కాంగ్రెస్ ఇంతకాలం చూస్తూ ఊరుకుంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా మత మార్పిడి చేసుకున్న వాళ్ళకి మత పరమైన రిజర్వేషన్లు తీసివేస్తామని పేర్కొన్నారు తప్ప రిజర్వేషన్లను రద్దు చేస్తామని ఎక్కడా ప్రస్తావించలేదు. దీని మీద అబద్ధపు ప్రచారం చేసిందే కాకుండా ఆర్ఎస్ఎస్ సిద్ధాం తకర్త గురూజీ గోల్వాల్కర్ 2015 తర్వాత రిజర్వే షన్లను రద్దు చేయాలని రాశారని అతిపెద్ద అబద్ధం చెప్పారు రేవంత్. అబద్ధాలనే ప్రచారాస్త్రాలుగా చేసుకున్న రేవంత్ జాతీయ రాజకీయాలను తాత్కా లికంగా ఆకర్షించవచ్చేమో గానీ... అవి ఆయన్ను విశ్వసనీయత గల దీర్ఘకాలిక నేతగా మాత్రం నిల బెట్టలేవు.

– డా॥ దొంతగాని వీరబాబు, హెచ్‌సీయూలో రాజనీతి శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్,

చందనోత్సవం

ఎటు చూసినా సంపెంగలు, పనస ఫలాల పరిమళాలు విరజిమ్మే ప్రకృతి రమణీయతతో విరాజిల్లే శ్రీ వైష్ణవ క్షేత్రం సింహాచలం. నర, వరాహ, సింహ అవతారాల కలయికతో త్రిభంగి మూర్తిగా సాక్షాత్తు శ్రీ మహా విష్ణువే అప్పన్నగా వెలసిన దివ్యధామం సింహగిరి. నిత్యం చందన అలంకా రంతో లింగాకృతిలో భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి తన నిజ రూపంలో, అదీ సంవత్సరంలో కొన్ని గంటల పాటు దర్శనం ఇచ్చే పవిత్ర దినం అక్షయ తృతీయగా వ్యవహరించే వైశాఖ శుద్ధ తదియ.

సింహాచల చందనోత్సవానికి వారం రోజులు ముందు నుంచే ప్రత్యేక జప, హోమ, పూజలతో చందనం అరగదీసే ప్రక్రియ ప్రారంభిస్తారు. రంగరించిన చందనంలో 60 రకాల వన మూలికలు, సుగంధ ద్రవ్యాలు కలుపుతారు. అక్షయ తృతీయ వేకువ జామునే స్వామికి ప్రత్యేక ఆరాధన ముగి సిన పిమ్మట ఆలయ అర్చకులు తమ నాసికలకు వస్త్రం చుట్టుకుని బంగారు బోరిగలతో స్వామి మీద ఉన్న చంద నాన్ని తొలగిస్తారు. అనంతరం గంగాజల ధారతో అభిషేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ రాత్రి వరకు నిజ రూపాన్ని లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారు. తిరిగి సాయంత్రం ఆరాధన అనంతరం చందనయాత్రలోనే అపురూపమైన ఘట్టం మొదలవుతుంది. అదే సహస్ర ఘటాభిషేకం. దేశం నలుమూలల నించి వచ్చిన శ్రీ వైష్ణవ స్వాములు సంప్రదాయంగా శ్రీ సూక్త, పురుష సూక్త, విష్ణుసహస్ర నామాలు పఠిస్తూ గంగాధర నుంచి ఘటాలతో తెచ్చిన జలాలతో స్వామికి సహస్ర ఘటాభిషేకం జరుగు తుంది. అనంతరం స్వామికి తొలి విడతగా మూడు మణు గుల చందన సమర్పణ చేస్తారు.

శ్రీ వరాహ లక్ష్మి నృసింహ స్వామి వారికి చందనాన్ని తొలి విడతగా అక్షయ తదియనాడు అనంతరం వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో మూడు విడతలుగా తొమ్మిది మణుగుల చందనాన్ని సమర్పిస్తారు. అంటే స్వామికి సుమారు 500 కిలోల చందనాన్ని సమర్పిస్తారు. ఎంతో వైభవంగా జరిగే ఈ చందన యాత్రను తిలకించేందుకు వేలాదిమంది భక్తులు వస్తారు. నారసింహ నామంతో సింహ గిరులు ప్రతిధ్వనిస్తాయి.

– అద్దంకి శ్రీరామ కుమార్, ఆకాశవాణి విశ్రాంత వార్తా ప్రతినిధి

(నేడు సింహాచల అప్పన్న చందనోత్సవం)

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.విదియ ఉ.8.44 వరకు, తదుపరి తదియ తె.4.45 వరకు (తెల్లవారితే శనివారం), **నక్షత్రం:** రోహిణి ప.12.34 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** సా.6.11 నుండి 7.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.12 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.27 నుండి 11.02 వరకు, అక్షయతృతీయ.; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.34, **సూర్యాస్తమయం:** 6.17.


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 48



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

SIMULTANEOUSLY PRINTED AT KHAMMAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఫ్యాషన్

ఒక్క మార్క్కూ వదల్లేదు!

నూటికి నూరు శాతం అంకితం



చదువుల తల్లి సరస్వతే అయినా ఆడపిల్ల చదువుకు వెనుకా ముందు ఆలోచించేవారు ఇంకా ఉన్నారు. అలాంటి వారందరూ అంకితను చూసి ఆలోచన మార్చుకోవాలి. ఎందుకంటే కర్నాటక రైతు బిడ్డ అంకిత పదవ తరగతి ఫలితాల్లో 625కు 625 మార్కులు తెచ్చుకుంది. రాష్ట్రం మొత్తం మీద సెంట్ పర్సెంట్ వచ్చింది అంకితకే. ఇలాంటి అంకితలు ఎందరో ఉంటారు చదువులో ప్రోత్సహిస్తే.

మే 9 వ తేదీ.

ఆ ఫోన్ వచ్చేసరికి బసప్ప పొలంలో ఉన్నాడు.

అవతలి వైపు ఉన్నది స్కూల్ టీచరు.

'బసప్ప గారు మీ అమ్మాయికి పదవ తరగతిలో స్టేట్ ఫస్ట్ మార్కులు వచ్చాయి'

'ఓ.. ఎన్ని మార్కులు వచ్చాయి సార్?'

'ఎన్ని వచ్చాయి ఏంటి బసప్ప గారు. అంతకు మించి వేయలేక 625కు 625 వేశారు. అంత బాగా చదివింది మీ అమ్మాయి. ఇన్ని మార్కులు ఇంకెవరికీ రాలేదు'...

కర్నాటకలోని బాగల్‌కోట్‌కు దాదాపు గంట దూరంలో ఉండే చిన్న పల్లె వజ్రమట్టి. ఆ ఊరే బసప్పది. ఆరెకరాల రైతు. పెద్దమ్మాయి అంకిత. ఇంకా ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. వార్త తెలిశాక ఇంటికి ఆఘమేఘాల మీద చేరుకున్నాడు. మరి కాసేపటిలో ఊరు ఊరంతా ఆ ఇంటి ముందే ఉంది. సందడి చేసింది. కోలాహలం సృష్టించింది. పులకరించింది. మరి ఒక చిన్న పల్లెటూరి నుంచి అంత బాగా చదివితే ఆ అమ్మాయిని ఆశీర్వదించకుండా ఎలా? అంకితను చూసి ప్రతి ఒక్కరూ మెటికలువిరవడమే.



● తల్లిదండ్రులు గీత, బసప్పలతో అంకిత

హాస్టల్‌లో ఉండి

అంకిత తన ఊరికి నలభై నిమిషాల దూరంలో ఉన్న ముధోల్‌లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుకుంది. స్కూల్ హాస్టల్‌లో ఉండి చదువుకుంటూనే సెలవుల్లో ఇంటికి వచ్చేది. 'నేను సెల్‌ఫోన్ వాడను. ఏ రోజు పాఠాలు ఆ రోజు చదువుకుంటాను. డిజిటల్ లైబ్రరీలో అదనపు మెటీరియల్ చదివాను. ఉదయం ఐదుకు లేస్తాను. మళ్లీ రాత్రి చదువుతూనే నిద్రపోతాను. ఇంట్లో ఉంటే ఇంటి పనులు ఏవో ఒకటి చేయాల్సి వస్తుంది. కాని హాస్టల్‌లో ఉంటే చదువు తప్ప వేరే పనేముంది. నా పాఠాలు అయ్యాక ఆడుకోవడం కూడా నేను మానలేదు. మా స్కూల్ టీచర్లు ముందు నుంచి నాకు మంచి మార్కులు వస్తాయని ఊహించారు. వారు నాకు అన్ని విధాల సపోర్ట్ చేస్తూ వచ్చారు. నాకు సెంట్ పర్సెంట్ వచ్చినందుకు ఆనందమే. కాని నా కంటే మా అమ్మానాన్నలు, స్కూల్ టీచర్లు ఎక్కువ సంతోషపడటం నాకు ఎక్కువ ఆనందాన్ని ఇచ్చింది. మా స్కూల్‌లో మంచి క్రమశిక్షణ ఉంటుంది. అందువల్లే నేను బాగా చదివాను' అని చెప్పింది అంకిత.

ఐ.ఏ.ఎస్. కావాలని

'మా అమ్మాయి బాగా చదువుతుందనుకున్నాము గాని ఇంత బాగా చదువుతుందని అనుకోలేదు. మేము ఇక ఆమె ఎంత చదవాలంటే అంత చదివిస్తాము. ఏది చదవాలన్నా ఎంత కష్టమైనా చదివిస్తాము' అన్నారు బసప్ప, అతని భార్య గీత. భర్తతో పాటు పొలానికి వెళ్లి పని చేసే గీత కూతురిని చూసి మురిసిపోతోంది.

'నేను ఇంటర్‌లో సైన్స్ చదివి ఇంజనీరింగ్ చేయాలనుకుంటున్నాను. ఆ తర్వాత ఐ.ఏ.ఎస్. చేస్తాను' అంది అంకిత.

ముఖ్యమంత్రి ప్రశంస

అంకితకు వచ్చిన మార్కుల గురించి విని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అభినందనలు తెలియచేశారు. ఇంకా బాగల్‌కోట్ ప్రభుత్వ అధికారులు ప్రశంసలు తెలియచేశారు. ఇక కర్నాటక డెప్యూటీ చీఫ్ మినిస్టర్ డి.కె.శివకుమార్ తానే స్వయంగా ఇంటికి వచ్చి అభినందిస్తానని కబురు పంపారు. అంకిత విజయం బాగా చదివే అమ్మాయిలందరికీ అంకితం.



వేసవిలో కాటన్ డ్రెస్సుల ప్రాముఖ్యత గురించి తెలిసిందే. అలాగే, ఈ సీజన్‌కి టెక్స్‌టైల్ జ్యువెలరీ అంతే స్పెషల్‌గా ఉంటుంది. ఎంచుకునే ఫ్యాబ్రిక్ ఏదైనా చేతితో రూపొందించే ఈ జ్యువెలరీ కొనుగోలు ఖర్చూ తక్కువే. అలాగే, ఎవరికి వారు నచ్చినట్టు ఇంట్లోనూ తయారుచేసుకోవచ్చు. యువతను ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంచే ఈ స్పెషల్ జ్యువెలరీ అంతే తాజాదనపు అనుభూతిని సొంతం చేస్తుంది.

సీజనల్ స్పెషల్

ప్రకృతికి దగ్గరగా!

పువ్వులంటేనే ప్రకృతి తెలియపరిచే ప్రేమ భాష. డిజైనర్ స్టూడియోలలో వాడగా ఉపయోగించిన మెటీరియల్‌తో అందమైన పూలను తయారుచేయవచ్చు. వాటిని పూసలు, జరీ దారాలతో ఆభరణాలుగా మార్చవచ్చు. ఈ పువ్వుల ఆభరణాలు దుస్తుల అందాన్ని మరింతగా పెంచుతాయి.

ఫ్యాబ్రిక్ ఎంపిక

పాదం నుంచి తల వరకు ప్రతి ఆభరణాన్ని వస్త్రాలంకరణతో మెప్పించవచ్చు. చందేరీ, సిల్క్, నెటెడ్, కాటన్ వంటి ఏ మెటీరియల్ అయినా ఈ ఆభరణాల తయారీలో ఉపయోగించవచ్చు.



బన్ స్టిక్

కాటన్ దారాలు, క్లాత్‌తో తయారుచేసిన పువ్వులను ఉపయోగించి చేసిన బన్ క్లిప్స్ వేసవి సీజన్‌కి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.

కంఠాభరణాలు

గార్మెంట్స్, బీడ్స్, జరీ లేదా కాటన్ దారాలను ఉపయోగించి చేసిన నెక్‌పీస్‌లు సంప్రదాయ చీరల మీదకే కాదు వెస్టర్న్ డ్రెస్సుల మీదకూ ప్రత్యేక హంగుగా నిలుస్తున్నాయి.

ఎంపిక చేసుకున్న ఫ్యాబ్రిక్‌కి కాంబినేషన్‌గా సిల్వర్ లేదా ఇతర లోహాలతో తయారైన మువ్వలు, గవ్వలు, జూకాలను జత చేయవచ్చు. దీని వల్ల ఈ జ్యువెలరీకి మరిన్ని హంగులు అమరుతాయి.

హెయిర్ కేర్

చుండ్రు వదలాలంటే...



● రెండు టీ స్పూన్‌ల నిమ్మరసాన్ని తీసుకుని ఒక టీస్పూన్ రసాన్ని తలకు (జుట్టు కుదుళ్లకు) పట్టించి పది నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. మరొక టీ స్పూన్ రసంలో కప్పు నీటిని కలిపి తల స్నానం పూర్తయిన తర్వాత తల మీద (స్కాల్ప్‌కు పట్టేలా) పోసుకోవాలి.

● వారం పాటు తలకు ఆలివ్ ఆయిల్ రాస్తే చుండ్రు వదులుతుంది. రోజూ తలస్నానం చేసే వాళ్లు రాత్రి పడుకునే ముందు ఆలివ్ ఆయిల్ పెట్టి ఉదయం తలస్నానం చేయవచ్చు.

● రెండు టేబుల్ స్పూన్‌ల కొబ్బరి నూనెలో అంతే మోతాదు నిమ్మరసం కలిపి తలకు పట్టించి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. మర్దన చేసిన తర్వాత ఇరవై నిమిషాలకు మామూలు షాంపూ లేదా కుంకుడుకాయ రసంతో తలస్నానం చేయాలి.

● టేబుల్ స్పూన్ మెంతులను రాత్రి నానబెట్టి ఉదయం మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి అందులో నిమ్మరసం (ఒక కాయ) కలిపి తలకు పట్టించాలి. అరగంట తర్వాత తలస్నానం చేయాలి. తలకు మెంతుల పేస్ట్ పెట్టినప్పుడు కొద్దిగా తేమగా ఉండగానే తలస్నానం చేయాలి. పూర్తిగా ఎండిపోయే వరకు ఉంచితే జుట్టుకు పట్టేసిన మెంతుల పేస్టును వదిలించడం కష్టం.

● కప్పు పుల్లటి పెరుగులో టీ స్పూన్ నిమ్మరసం కలిపి తలకు పట్టించాలి. ఆరిన తర్వాత తలస్నానం చేయాలి.

● చుండ్రును వదిలించడంలో వేపాకు కూడా బాగా పని చేస్తుంది. వేపనూనె తలకు పట్టించి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. ఆ తర్వాత తలస్నానం చేయాలి. వేప నూనె లేకపోతే వేపాకు రసం పట్టించి మర్దన చేయవచ్చు.

బ్యూటిప్స్

మృదువైన హస్తాల కోసం...

- పులిసిన పెరుగుపైన ఉండే మీగడ తీసుకుని చేతులకి మసాజ్ చేస్తూ ఉంటే చేతులు మృదువుగా ఉంటాయి. పెట్రోలియమ్ జెల్లీతో కూడా మసాజ్ చేసుకోవచ్చు.
- ఆలివ్ ఆయిల్ ఒక చెంచా, నిమ్మరసం ఒక చెంచా, గ్లిజరిన్ ఒక చెంచా, గోధుమరవ్వ రెండు చెంచాలు, పాలు ఒక చెంచా కలిపి చేతులకి రాసుకుని గంట తర్వాత వేడి నీటితో శుభ్రంగా కడుక్కోవాలి.



- స్పూను దానిమ్మరసం, స్పూను టొమోటో గుజ్జు కలిపి దానిలో కొన్ని గ్లిజరిన్ చుక్కలు కలిపి చేతులకి పట్టించి ఒక గంట అయిన తర్వాత కడుక్కుంటే చేతులు చక్కగా మెరుస్తాయి.
- రెండు స్పూన్ల దానిమ్మరసంలో స్పూను పంచదార కలిపి చక్కెర కరిగిన తర్వాత చేతులకి పట్టించి నెమ్మదిగా మసాజ్ చేస్తే చేతులు నున్నగా ఉంటాయి.
- చెంచా బాదం పొడిలో తగినన్ని పాలు కలిపి పేస్ట్ చేసుకొని చేతులకి రాసుకొని పావుగంట తర్వాత కడుక్కోవాలి.
- నారింజ రసం రెండు చెంచాలు, తేనె రెండు చెంచాలు కలిపి చేతులకి రాసుకొని ఇరవై నిమిషాల తర్వాత వేడి నీటితో కడుక్కోవాలి.
- రెండు చెంచాలు గ్లిజరిన్, రెండున్నర చెంచాలు రోజ్ వాటర్ కలిపి చేతులకి మసాజ్ చేస్తే చేతులు మృదువుగా ఉంటాయి.
- రాత్రి పడుకోబోయే ముందు చేతులకి బేబీ ఆయిల్ పూసి మృదువుగా మసాజ్ చేస్తే చేతులు కోమలంగా ఉంటాయి.

వంటిల్లు

సిప్ సిప్పులోనూ... రుచి అదే చల్లదనం!

ఈ కాలంలో ఏమి తిన్నా... చల్లగా తినాలని ఉంటుంది. సీజనల్ ఫ్రూట్స్ అన్నింటినీ రుచి చూడాలనీ ఉంటుంది. ఆరోగ్యాన్నిచ్చే పండ్లు పాలతో చల్లని డ్రింక్స్ సిప్ చేద్దాం.



థండయ్ కుల్ఫీ



కావలసినవి: వెన్న తీయని పాలు – 2 కప్పులు; కోవా– 100 గ్రాములు ; కండెన్స్‌డ్ మిల్క్ – కప్పు; పాల పొడి– పావు కప్పు ; బాదం – 10 ; గసగసాలు – టేబుల్ స్పూన్ ; మిరియాలు – 5 ; యాలకులు – 2 ; సోంపు – టీ స్పూన్.

తయారీ: ● బాదం పప్పులను నానబెట్టి తొక్క వలిచి పలుకుగా గ్రైండ్ చేయాలి ● గసగసాలను పది నిమిషాల సేపు నీటిలో నానబెట్టి గ్రైండ్ చేయాలి. అవి ఒక మోస్తరుగా మెదిగిన తర్వాత అందులోనే మిరియాలు, యాలకులు, సోంపు వేసి అవి కూడా మెత్తగా మెదిగే వరకు గ్రైండ్ చేయాలి ● పాలను ఒక వెడల్పాటి పాత్రలో పోసి మరిగించాలి. కాగిన పాలలో కోవా, కండెన్స్‌డ్ మిల్క్, పాలపొడి వేసి కలిపి సన్న మంట మీద మరిగించాలి. ఇవి మరిగినంత సేపూ అడుగుపట్టకుండా గరిటెతో అడుగు వరకు కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం చిక్కబడిన తర్వాత అందులో ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న గసగసాల మిశ్రమాన్ని, బాదం పలుకులను వేసి కలుపుతూ ఐదు నిమిషాల సేపు మరగనిచ్చి దించేయాలి. చల్లారిన తర్వాత మిశ్రమాన్ని కుల్ఫీ మౌల్డ్‌లో పోసి ఫ్రీజర్‌లో పెట్టాలి. సెట్ అవడానికి 8 గంటలు పడుతుంది. డ్రింక్‌గా తాగాలంటే గంట చాలు.

వాటర్ మెలన్ గోలా



కావలసినవి: పుచ్చకాయ – ఒకటి (మీడియం సైజు); చక్కెర– టేబుల్ స్పూన్ ; నిమ్మకాయ – 1 (రసం తీసుకోవాలి) ; ఉప్పు – చిటికెడు ; చాట్ మసాలా – చిటికెడు ; ఐస్ క్యూబ్‌లు – 4.

తయారీ: ● పుచ్చకాయ ముక్కల్లో చక్కెర, ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా, ఐస్ క్యూబ్‌లు వేసి మిక్సీలో బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని నేరుగా గ్లాసులో పోసుకుని తాగవచ్చు లేదా ఐస్ క్యాండీగా కావాలంటే మౌల్డ్‌లో పోసి ఎనిమిది గంటల పాటు ఫ్రీజర్‌లో పెట్టాలి. ఫ్రీజర్‌లో నుంచి తీసిన తర్వాత మౌల్డ్ నుంచి ఐస్ క్యాండీని వేరు చేసి పిల్లలకివ్వడమే. క్యాండీ మధ్యలో విరిగిపోకుండా సులువుగా బయటకు రావాలంటే మౌల్డ్‌ను పది సెకన్లపాటు గోరువెచ్చటి నీటిలో పెట్టాలి.

ఆమ్ర శ్రీఖండ్

కావలసినవి: చిక్కటి పెరుగు – 3 కప్పులు ; చక్కెర – ఒకటిన్నర కప్పులు ; మామిడి పండ్లు – 2 (పెద్దవి) ; యాలకుల పొడి – పావు టీ స్పూన్ ; కుంకుమ పువ్వు – చిటికెడు ; బాదం పప్పు – పది (పలుకులు చేయాలి).

తయారీ: ● మామిడి పండ్ల తొక్క తీసి ముక్కలు చేయాలి. మిక్సీ జార్‌లో మామిడి ముక్కలు, పెరుగు, యాలకుల పొడి, కుంకుమ పువ్వు, చక్కెర వేసి మెత్తగా అయ్యే వరకు బ్లెండ్ చేయాలి ● ఈ మిశ్రమాన్ని రెండు గంటల పాటు ఫ్రిజ్‌లో పెట్టాలి ● ఫ్రిజ్‌లో నుంచి తీసి కప్పులో లేదా గ్లాసులో పోసి బాదం పలుకులతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. పిల్లలు దీనిని పూరీ, చపాతీల్లోకి కూడా ఇష్టపడతారు.

భాపా ఆమ్ దోయి



కావలసినవి: చిక్కటి పెరుగు – ఒకటిన్నర కప్పులు ; కండెన్స్‌డ్ మిల్క్ – 6 టేబుల్ స్పూన్‌లు ; క్రీమ్ – ఒకటిన్నర కప్పు ; మామిడి పండు గుజ్జు – అర కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్.

తయారీ: ● వీటన్నింటినీ ఒక పాత్రలో వేసి సమంగా కలిసే వరకు బాగా చిలకాలి. ఈ మిశ్రమాన్ని మట్టి పాత్రలో పోసి అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేయాలి ● ప్రెషర్ కుక్కర్‌లో స్టాండ్ పెట్టి నీరు పోసి ఐదు నిమిషాల సేపు వేడి చేయాలి. నీరు మరిగి ఆవిరి రావడం మొదలైన తర్వాత మట్టి పాత్రను జాగ్రత్తగా స్టాండ్ మీద పెట్టి కుక్కర్ మూత పెట్టి స్టవ్ ఆపేయాలి ● అర గంట తర్వాత తీసి చల్లారనిచ్చి ఫ్రిజ్‌లో రెండు గంటల సేపు పెడితే ఆమ్ దోయీ రెడీ.

సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 10 । మే । 2024



అధిక శ్రమ.. అరకొర వేతనం
రేయింబవళ్లు వెట్టి చాకిరీ చేస్తున్న సింగరేణి సెంట్రల్ డిస్పాచ్ సెక్షన్ సిబ్బంది చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారు. 2లో



అక్షయ తృతీయ సందడి
నేడు అక్షయ తృతీయ కావడంతో పసిడి ప్రియుల ఆకాంక్షలకు అనుగుణంగా బంగారు దుకాణాల్లో ఆభరణాలు సిద్ధం చేశారు. 2లో

గరిష్టం / కనిష్టం
37° / 27°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం సాధారణ పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి



పనులు పరిశీలిస్తున్న దామోదర్‌రెడ్డి

అశ్వారావుపేటరూరల్: అటవీ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎఫ్‌డీఓ కె. దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వినాయకపురం, కావడిగుండ్ల, అశ్వారావుపేట అటవీ సెక్షన్లలో గురువారం ఆయన పర్యటించి అభివృద్ధి, ప్లాంటేషన్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోడు, అటవీ భూముల అక్రమణలు, కలప స్మగ్లింగ్‌పై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అటవీ శాఖ రేంజర్ మురళి, ఎఫ్‌ఎస్‌ఓలు అరుణ్‌కుమార్, సంపత్‌కుమార్ ఉన్నారు.

పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి

భద్రాచలంటౌన్: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన స్కూళ్లను సుందరంగా తీర్చిదిద్దాలని డీఈఓ వెంకటేశ్వరా చారి అన్నారు. మండలంలో ఎంపికైన పాఠశాలల్లో జరుగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పనులు పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతగా ఉండాలని, జూన్ మొదటి వారంలోపు పూర్తయ్యేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల ల్లో పోలింగ్ కేంద్రాలకు ఎంపికైన వాటిలో విద్యుత్‌తో పాటు అన్ని గదుల్లో ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ నాగ రాజశేఖర్, సీఆర్పీలు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెంటౌన్: ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పి.పరందామరెడ్డి అన్నారు. రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన పరిశీలించారు. శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి పలు సూచనలు చేశారు. క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ కోచ్ పి.నాగేందర్, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ గుమ్మడి భరత్, క్రికెట్ కోచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పోలింగ్

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశాం
- జిల్లాలో 146 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- ఎన్నికల విధుల్లో 2,500 మంది పోలీస్ సిబ్బంది
- గొత్తికోయ ఓటర్లకు ప్రత్యేక అవగాహన కల్పించాం
- 'సాక్షి'తో ఎస్పీ రోహిత్‌రాజ్



ఎస్పీ రోహిత్‌రాజ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు 2,500 మంది సిబ్బందితో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రోహిత్‌రాజ్ తెలిపారు. మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు కూడా తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎన్నికల ఏర్పాట్లపై ఎస్పీ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

971 పోలింగ్ స్టేషన్లు

జిల్లా వ్యాప్తంగా 971 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇందులో 146 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. వాటిలోనూ 135 పోలింగ్ స్టేషన్లు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల పరిధిలో ఉన్నాయి. ఇల్లెందు, భద్రాచలం, పినపాక నియోజకవర్గాల పరిధిలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లా పోలీస్ బలగాలకు అదనంగా సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ నుంచి పది కంపెనీలు రానున్నాయి. మొత్తంగా 2,500 మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వర్తిస్తారు.

మావోల వ్యూహాలను తిప్పికొడతాం..

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చర్ల మండలంలో పోలింగ్ రోజు మందుపాతరను కనుగొని సురక్షితంగా పేల్చేశాం. ఈసారి కూడా భద్రతా సిబ్బందిని కవ్వించేందుకు మావోయిస్టులు వ్యూహాలు పన్నే ఆస్కారం ఉంది. అందువల్ల ఇప్పటికే రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేశాం. రోడ్ ఓపెనింగ్ పార్టీ ద్వారా ప్రత్యేకంగా మందుపాతరలు గుర్తించే పనిని ఉధృతం చేస్తున్నాం. ఇప్పటికే చర్ల మండలంలో రెండుచోట్ల భూమిలో పాతిపెట్టిన ఐఈడీలు వెలుగు చూశాయి. వాటిని నిర్వీర్యం చేశాం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పినపాక నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును అడ్డుకోవడం వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని రాజకీయంగా సున్నితంగా ఉండే 11 పోలింగ్ స్టేషన్లను గుర్తించాం. అక్కడ మరింత మంది సిబ్బందిని నియమించడం ద్వారా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం

అవగాహన కల్పించాం..

మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో మన జిల్లాలో పోలింగ్ సాయంత్రం 4 గంటలకే ముగుస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చివరి గంటలో అధికంగా ఓటర్లు రావడంతో రాత్రి వరకు పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. దీంతో ఈసారి సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న గ్రామాలు ముఖ్యంగా గొత్తికోయల గూడేలపై దృష్టి సారించాం. ఉదయమే పోలింగ్‌కు రావాల్సిందిగా అక్కడి పటేళ్ల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి ఓటర్లను కోరాం.

12 చెక్‌పోస్టులు

భద్రాద్రి జిల్లా రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో జిల్లా వ్యాప్తంగా 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నాం. వీటికి అదనంగా అంతర్ జిల్లా స్థాయిలో నాలుగు చెక్ పోస్టులు ఉన్నాయి. ఇప్పటి వరకు మద్యం, గంజాయి, నగదు కు సంబంధించి రూ. 3.60 కోట్లు తనిఖీల్లో పట్టుబడ్డాయి.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

కొత్తగూడెంటౌన్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. పోలీస్ సిబ్బంది బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కొత్తగూడెం క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టే వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని, ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని చెప్పారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. రూట్ మొబైల్స్ ఇన్‌చార్జ్ అధికారులకు పలు సూచనలు చేసిన ఎస్పీ.. పోలింగ్ విధుల పట్ల అధికారులకు, సిబ్బందికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) టి.సాయిమనోహర్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, చంద్రభాను, సతీష్‌కుమార్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాతోనే రామాలయ అభివృద్ధి



రామాలయ ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- సుందర భద్రాద్రిగా తీర్చిదిద్దుతాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి హామీకి కట్టుబడి ఉన్నామని, ముమ్మాటికి భద్రాచలం అభివృద్ధి తమతోనే సాధ్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన భద్రాచలం పట్టణంలోని జ్ఞాన మందిరం గుట్టపై నుంచి రామాలయం వ్యూ పాయింట్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులతో మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగంగా తొలగించాల్సిన ఇళ్ల నివేదికను త్వరగా అందజేయాలని ఆదేశించారు. మాడ వీధుల విస్తరణతో పాటు భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. భద్రాచలం వచ్చిన భక్తులు ఎక్కువ సమయం గడిపేలా ఉపాలయాల విస్తరణతో పాటు టూరిజం హబ్‌ను కేంద్రీకృతం చేసేలా ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని సూచించారు. మిథిలా స్టేడియం ప్రాంగణంలో సోలార్ అమర్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, తద్వారా విద్యుత్ ఆదాతో పాటు ఖర్చు తగ్గుతుందని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో కచ్చితంగా రామాలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి సైతం సానుకూలంగా ఉన్నారని చెప్పారు. దేశంలో అయోధ్య మాదిరిగా భద్రాచలం రామాలయం పేరు వినిపించేలా పనులు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, నాయకులు రసూల్, యశోద రాంబాబు, తోటకూరి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వాహనం తనిఖీ..

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాహనాన్ని స్థానిక కూనవరం రోడ్డులోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎఫ్‌ఎస్‌టీ బృందాలు తనిఖీ చేశాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి తుమ్మల.. కూనవరం రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా చెక్‌పోస్ట్ వద్ద ఎఫ్‌ఎస్‌టీ బృందాలు వాహనాన్ని తనిఖీ చేశాయి.

నగదు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలి



రచిత్‌రాజ్‌కు స్వాగతం పలుకుతున్న ఐటీడీఏ పీఓ తదితరులు

- ఎన్నికల పరిశీలకులు రచిత్‌రాజ్
- స్వాగతం పలికిన ఐటీడీఏ పీఓ

భద్రాచలం/బూర్గంపాడు : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీ చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లో అక్రమ మద్యం, నగదు రవాణాకు అవకాశం ఇవ్వొద్దని ఎన్నికల పరిశీలకులు రచిత్‌రాజ్ అన్నారు. భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఏర్పాటుచేసిన ఎఫ్‌ఎస్‌టీ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలను తప్పనిసరిగా రికార్డు చేయాలన్నారు. ఎన్నికల సంఘం సూచన మేరకు ప్రచార ఖర్చులు, ఇతర వ్యయాల నమోదుకు రిజిస్టర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సెలవు రోజుల్లో కూడా పటిష్ట నిఘా ఉండాలని, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా తనిఖీలు చేపట్టాలని సూచించారు. అంతకుముందు బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర వద్ద ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ రచిత్‌రాజ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు, ఏఈఓ వేల్పుల శ్రీనివాసరావు, తహసీల్దార్లు రాఘవరెడ్డి, ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అందరికీ మేలు

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి తదితరులు

మధిర/ఎర్రుపాలెం: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఆయన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మధిర, ఎర్రుపాలెంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వకుండా ద్రోహం చేసిందని, రాష్ట్రంలో తమ ప్రభుత్వం రాగానే రూ.272 కోట్లు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేశామని తెలిపారు. ఎన్నికల ముందు చెప్పినట్టుగా టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి 30 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించామని అన్నారు. రాజకీయాలతో పాటు అభివృద్ధి కూడా ఎంతో అవసరమని తెలిపారు. మధిర శాసనసభ తనకు అత్యంత ప్రాణప్రదమైనదని, ఇక్కడి ప్రజలు చూపించిన ప్రేమ, ఆశీస్సులతోనే తనకు ఈ హోదా లభించిందని అన్నారు. ఈ పదవితో మధిర ప్రాంతంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. మధిరకు ఔటర్ రింగ్ రోడ్డు మంజూరు చేయాలని ఆర్అండ్‌బీ మంత్రిని కోరగా, అనుమతులు వచ్చాయని తెలిపారు. ఎర్రుపాలెం మండలంలో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేస్తామని, ఇందిరమ్మ డెయిరీ ఏర్పాటుకు చర్యలు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఎర్రుపాలెం మండల రైతులకు సాగర్ మూడో జోన్ ద్వారా కాకుండా రెండో జోన్ ద్వారానే నీరందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో రూ.ఏడు లక్షల కోట్ల అప్పు చేసి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు కర్రుకాల్చి వాత పెడితే ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుల మతాల మధ్య చిచ్చు పెడుతూ ఓట్లు దండుకోవాలని చూస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లు ఎత్తివేయాలని, రాజ్యాంగాన్ని మార్చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందని, ప్రజలు దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఖమ్మం ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, సుధాకర్‌రెడ్డి, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, సూరంశెట్టి కిషోర్, మల్లాది వాసు, కరివేద సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చారు..

ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ



మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, పక్కన అభ్యర్థి నామా, మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మంఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల వేళ తప్పుడు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. ఆపై హామీల అమలులో విఫలమైందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. ఖమ్మం లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుతో కలిసి ఖమ్మం, మంచుకొండలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సమావేశాల్లో వారు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు వస్తున్న జనాలను చూసి కాంగ్రెస్ నేతలకు గుబులు పట్టుకుందని అన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగా.. కాంగ్రెస్ మాత్రం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులెవరో తెలియదని.. బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు మాత్రం స్థానికంగా అందరికీ అందుబాటులో ఉంటారని తెలిపారు.

విస్తృత తనిఖీలు చేపట్టాలి



సిబ్బందితో మాట్లాడుతున్న రామ్ కుమార్

కరకగూడెం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు చేపట్టాలని మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్ కుమార్ గోపాల్ సూచించారు. గురువారం ఆయన పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం క్రాస్‌రోడ్ వద్ద గల చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మద్యం, నగదుపై తరలింపుపై నిరంతర నిఘా పెట్టాలని ఆదేశించారు. అనంతరం పలు వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌టీ అధికారి కొమరం లక్ష్మణ్ రావ్, సివిల్ పోలీస్ కెప్టెన్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేయకుంటే ఓటెయ్యం



మాట్లాడుతున్న పెద్ద వెంకటాపురం గ్రామస్తులు

పెద్ద వెంకటాపురం గ్రామస్తుల తీర్మానం

గుండాల: ఎమ్మెల్యేలు, మంత్రులు ఎంతమంది మారినా తమ గ్రామాన్ని పట్టించుకోవడం లేదని, గ్రామాభివృద్ధికి లిఖితపూర్వకంగా స్పష్టమైన హామీ ఇస్తేనే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేస్తామని, లేదంటే ఎన్నికలు బహిష్కరిస్తామని ఆళ్లపల్లి మండలం పెద్ద వెంకటాపురం గ్రామస్తులు తీర్మానించారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో తమ గ్రామంలో రోడ్లు, వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. అన్ని పార్టీల నాయకులకు ఎన్నికల సమయంలోనే తమ గ్రామం గుర్తొస్తుందని, ఆ తర్వాత తమ బాధలు ఎవరికీ పట్టవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆళ్లపల్లి నుంచి పెద్ద వెంకటాపురం వరకు రోడ్డు సౌకర్యం, పెద్ద వెంకటాపురం– సింగారం, పెద్దవెంకటాపురం – తుమ్మల గూడెం, బూసురాయి గ్రామాల మధ్య రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఏదైనా మొబైల్ సిగ్నల్ సౌకర్యం కల్పించాలని కోరారు. డ్రెయినేజీ వ్యవస్థ లేదని, పోడు భూముల సమస్యతో నిత్యం అటవీ అధికారులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చాకే తమను ఓట్లు అడగాలని స్పష్టం చేశారు. సమావేశంలో గ్రామ దొర సురేందర్, పటేల్ నాగరాజు, నీలమయ్య, కళ్యాణ్, నాగేశ్వరావు, నర్సింహారావు, మల్లయ్య, వసంతరావు, సత్యం, రామయ్య, బుచ్చయ్య, లక్ష్మీనారాయణ, నరేందర్, లక్ష్మి, కళావతి, మంగ, నరేష్ పాల్గొన్నారు.

ఎన్నికల బహిష్కరణపై విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ తదితరులు

చుంచుపల్లి: మండల పరిధిలోని ప్రశాంతినగర్ పంచాయతీ గరిమెళ్లపాడు గ్రామస్తులు ఎన్నికల్లో ఓటు వేయమంటూ ఏర్పాటుచేసిన బ్యానర్ల విషయంలో అధికారులు గురువారం విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఆర్డీఓ మధు, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ అశోక్ తదితరులు గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఏమైనా సమస్యలుంటే అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలని, ప్రజాస్వామ్యంలో ఓటు వేయటం అందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. దీంతో పలువురు సానుకూలంగా స్పందించి అధికారుల ఆదేశాల ప్రకారం ఓటింగ్‌లో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, కార్యదర్శి రఘుబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నామా తనయుడి ప్రచారం


ఉపాధి పని ప్రదేశంలో ప్రచారం చేస్తున్న నామా తనయుడు పృథ్వీతేజ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితరులు

దమ్మపేట: బీఆర్ఎస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ ఆయన తనయుడు పృథ్వీతేజ్ గురువారం మండలంలో ప్రచారం నిర్వహించారు. మల్కారం, దిబ్బగూడెం, రాచూరుపల్లి, తాళ్లమడ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, రావు జోగేశ్వరరావు, ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి, వగ్గెల పూజ, అంకత మహేశ్వరరావు, రూప్ సింగ్, కొనుపాతు చిట్టిబాబు, రావూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్' రుణాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏజీఎం అజయ్ రెడ్డి

టేకులపల్లి: ఆయిల్‌పామ్ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ ఖమ్మం ఏజీఎం అజయ్‌రెడ్డి సూచించారు. గురువారం చింతోనిచెలకలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఏజీఎం మాట్లాడుతూ ఆయిల్ పామ్ కంపెనీతో ట్రైపార్టీ అగ్రిమెంట్ చేసుకుని, ఓవర్ డ్రాఫ్ట్ క్యాష్ క్రెడిట్ కింద రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఒరిజినల్ పట్టాదార్ పాసుబుక్ ఉన్న రైతులకు ఏజెన్సీ ఏరియాలో ఎకరానికి రూ.మూడు లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు 87 పైసలు వడ్డీతో రుణం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. టేకులపల్లి బ్రాంచ్ మేనేజర్ పి.వెంకట కృష్ణారావు, బేతంపూడి సొసైటీ సీఈఓ పొన్నోజు ప్రేమాచారి పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

పాల్వంచ: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని నటరాజ్ సెంటర్‌కు చెందిన లాడ్య ఇంద్రజ కుమార్తె పవిత్రకు భద్రాచలానికి చెందిన కొమరపు సాయికుమార్‌తో గతేడాది వివాహం జరిగింది. పవిత్ర దివ్యాంగురాలైనప్పటికీ ఇష్టపడటంతో కులాంతర వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో కట్న కానుకలు కూడా ఇచ్చారు. కాగా పెళ్లయిన కొద్దిరోజుల నుంచే పవిత్రను భర్త, అతని తల్లి స్వప్న అదనపు కట్నం తేవాలంటూ, కులంపేరుతో దూషిస్తున్నారు. శారీరక, మానసికంగా వేధించడంతోపాటు గత నెల 9న పుట్టింట్లో వదిలి వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు భర్త, అత్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.రాము తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,229

అక్షయ తృతీయ సందడి

నేడు 'పసిడి' పండుగ

- జ్యూయలరీ షాపుల్లో కొత్త డిజైన్లు, కొనుగోళ్లపై ఆఫర్లు


ఖమ్మంలోని ఓ షాపులో నగలు కొనుగోలు చేస్తున్న మహిళలు (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: అష్టైశ్వర్యాల అక్షయ తృతీయ వచ్చేసింది. పసిడి ప్రియులకు ఆకాంక్షలకు అనుగుణంగా నగల దుకాణాలు, షోరూంలు ఆభరణాల విక్రయాలతో సందడి చేస్తున్నాయి. బంగారాన్ని లక్ష్మి, సరస్వతి, గౌరీ రూపాలుగా మహిళలు కొలిచి అక్షయ తృతీయ రోజున కొనుగోలు చేస్తారు. అక్షయ అంటే తరుగుదల లేనిది అని అర్థం. వైశాఖ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే తదియ, రోహిణి నక్షత్రం కలిసిన రోజును అక్షయ తృతీయ అంటారు. ఈ ఏడాది మే 10 శుక్రవారం అక్షయ తృతీయగా పండితులు నిర్ణయించారు. అక్షయ తృతీయ రోజున ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతం అవుతుందని, ఏ వస్తువును కొనుగోలు చేసినా అది అభివృద్ధి అవుతుందనే కొందరు విశ్వసిస్తారు. కాగా ఖమ్మం నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా అక్షయ తృతీయ సందడి కనబడుతోంది. నగరంలోని గాంధీచౌక్, కమాన్ బజార్, కస్బా బజార్, వైరారోడ్‌లలో జ్యూయలరీ షోరూంలు, దుకాణాల్లో నిర్వాహకులు అక్షయ తృతీయకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడమే కాక కొనుగోళ్లపై ఆఫర్లు ప్రకటించారు.

కొత్త డిజైన్లు

అక్షయ తృతీయకు జ్యూయలరీ దుకాణాలు, కార్పొరేట్ షోరూంలు విక్రయాలతో కళకళలాడుతున్నాయి. పసిడి ప్రియుల మనోభావాలకు అనుగుణంగా, మనసు గెలుచుకునే విధంగా భిన్నమైన డిజైన్లను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. కొంత కాలంగా అక్షయ తృతీయ క్రేజ్ పెరగటంతో వ్యాపార సంస్థలు ఈ పండుగ రోజు విక్రయాల కోసం భారీగానే పెట్టుబడులు పెడుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి కొత్త డిజైన్లను పోటీగా తీసుకువచ్చి విక్రయానికి అందుబాటులో ఉంచుతున్నాయి. పసిడి ప్రియులు ప్రధానంగా మగువలు ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ఎంపిక చేసుకునే డిజైన్లు, మోడల్స్‌ను వివిధ ప్రాంతాల నుంచి తెప్పించి షోరూంలలో అందుబాటులో ఉంచారు. కోల్‌కతా, రాజ్‌కోట్, ముంబై, హైదరాబాద్, చెన్నై, గుజరాత్, కోయంబత్తూర్, బెంగళూరు తదితర ప్రాంతాల భిన్నమైన మోడల్స్‌ను జ్యూయలరీ షోరూంలు విక్రయిస్తున్నాయి.

గడిచిన ఐదేళ్లలో ఏళ్లుగా బంగారం ధరలు (10 గ్రాములకు రూ.వేలలో)

కాలం	22 క్యారెట్లు	24 క్యారెట్లు
మే 9న	66,150	72,160
నెల క్రితం	66,680	72,740
ఆరు నెలల క్రితం	59,980	65,430
ఏడాది క్రితం	57,510	62,730
రెండేళ్ల క్రితం	53,600	58,470
మూడేళ్ల క్రితం	50,900	55,930
నాలుగేళ్ల క్రితం	49,740	54,260
ఐదేళ్ల క్రితం	47,390	51,680

పెరిగిన పసిడి ధరలు

బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఖమ్మం మార్కెట్‌లో ప్రస్తుతం 10గ్రాముల 24క్యారెట్ల బంగారం ధర రూ.72,160లు కాగా గత ఏడాది అక్షయ తృతీయ ముందు రోజు రూ.62,730లుగా పలికింది. 22 క్యారెట్ల.. ధర ప్రస్తుతం రూ. 66,150లు కాగా గతేడాది 56,050లుగా పలికింది. ఏడాది కాలంలో బంగారం ధర రూ.10 వేలు పెరిగింది. అక్షయ తృతీయ సందర్భంగా నగల షోరూంలు ఆఫర్లు ప్రకటించాయి. బంగారం కొనుగోళ్లపై ఉచితంగా గోల్డ్ కాయిన్స్, మేకింగ్ చార్జీలు ఉచితమని, క్రెడిట్, డెబిట్ కార్డులతో పేమెంట్స్‌కు డిస్కౌంట్లు ప్రకటించాయి.

రేయింబవళ్లు శ్రమ.. అరకొర వేతనం

- సింగరేణి సెంట్రల్ డిస్పాచ్ సెక్షన్‌లో పనిభారం
- చాలీచాలని వేతనాలతో కార్మికుల అవస్థలు


సింగరేణి డాక్ బ్యాగ్‌లు

సింగరేణి(కొత్తగూడెం): రేయింబవళ్లు వెట్టి చాకిరీ చేస్తున్న సింగరేణి సెంట్రల్ డిస్పాచ్ సెక్షన్ సిబ్బంది చాలీచాలని వేతనాలతో అవస్థ పడుతున్నారు. సంస్థకు చెందిన 11 ఏరియాల్లోని గనులు, డిపార్ట్‌మెంట్‌ల వారీగా సర్క్యులర్లు, ఇతర ఫైళ్లు ప్రధాన కార్యాలయంల నుంచి ఆయా ఏరియాలకు, సింగరేణిభవన్‌కు, మళ్లీ అక్కడి నుంచి ప్రధాన కార్యాలయానికి తరలింపు(డాక్)నకు యాజమాన్యం సుమారు 50 ఏళ్ల క్రితం సెంట్రల్ డిస్పాచ్ సెక్షన్ ఏర్పాటు చేసింది. కంపెనీకి సంబంధించిన ఆరుగురు క్లర్క్‌లు, ఇద్దరు హెల్పర్లను కేటాయించింది. కాగా 2006లో ప్రైవేటు టెండర్లు పిలిచి డాక్ సేవలను అప్పగించారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ. 11 వేలు చెల్లిస్తోంది. ఆరుగురు కార్మికులనే నియమించగా సింగరేణి వ్యాప్తంగా విధులు నిర్వహించేందుకు వారు నానా అవస్థ పడుతున్నారు.

విధులు ఇలా..

సెంట్రల్ డిస్పాచ్ సెక్షన్‌లో సేవలందించే కార్మికులు పగటి పూట సింగరేణి ప్రధాన కార్యాలయంలోని 36 విభాగాల నుంచి ఫైళ్లను సేకరించాలి. రాత్రి 10.45 గంటలకు కొత్తగూడెం రైల్వేస్టేషన్‌కు చేరుకుని రైలు ద్వారా సికింద్రాబాద్‌కు, అక్కడి నుంచి బస్సు ద్వారా లక్డీకపూల్‌లో ఉన్న సింగరేణి భవన్‌కు తీసుకెళ్లాలి. అక్కడ ఫైళ్లను అప్పగించి, అక్కడి ఫైల్స్‌ను తీసుకుని మళ్లీ కొత్తగూడెం తీసుకొచ్చి సింగరేణి ప్రధాన కార్యాలయంలో అప్పగించాలి. ఫైళ్లను తీసుకెళ్లే సామగ్రి సుమారు డాక్ బ్యాగ్ సుమారు 100 కేజీల వరకు బరువు ఉంటుందని, అంత బరువు ఒక్కరే మోయాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. ఆదివారం కూడా సెలవు ఉండదని, శుభ, అశుభ కార్యాలకు హాజరయ్యే పరిస్థితి కూడా ఉండదని పేర్కొంటున్నారు. రక్షణ లేకపోవడంతో గతంలో రెండుసార్లు డాక్ బ్యాగ్‌లు మిస్సయ్యాయి. సింగరేణి విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది వెతకగా ఒక బ్యాగ్ దొరికింది. మరో బ్యాగ్ ఇప్పటి వరకు దొరకలేదు. ఆ తర్వాత డాక్ బ్యాగ్‌కు యాజమాన్యం సెక్యూరిటీ గార్డును కేటాయించింది. కొంతకాలానికి తొలగించింది. సింగరేణి ఫైళ్ల తరలింపు కోసం ఏర్పాటు చేసిన డాక్ సేవలను కొందరు అధికారులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఉండే తమ ఇళ్లకు, పిల్లలకు పచ్చళ్లు, పండ్లు డాక్ ద్వారానే పంపిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి సెంట్రల్ డిస్పాచ్ సెక్షన్‌లో సిబ్బంది సంఖ్య, వేతనం పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

పిడుగుపడి 16 గొర్రెలు మృతి


పిడుగుపాటుతో మృతిచెందిన గొర్రెలు

పాల్వంచరూరల్ : ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షానికి పిడుగుపడి 16 గొర్రెలు మృత్యువాత పడిన ఘటన పాల్వంచ మండలం బిక్కుతండాలో గురువారం చోటుచేసుకుంది. పిడుగుపాటుకు గొర్రెల కాపరి కూడా స్పృహ కోల్పోయి త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. బిక్కుతండా పంచాయతీ పరిధిలోని బిచ్చకుంట చెరువు సమీపంలోని వెంగళరావు కాలనీకి చెందిన వేల్పుల పెద్దిరాజు గొర్రెలు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గొర్రెల మందతోపాటు పెద్దిరాజు కూడా సమీపంలోని కుంకుడుకాయ చెట్టు కిందకు వెళ్లాడు. ఆ సమయంలో సమీపంలోనే పిడుగు పడడంతో రూ.1.50 లక్షల విలువైన మూడు మేకలు, 13 గొర్రెలు మృతిచెందాయి. మరో ఆరు గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. పశువుల కాపరి కూడా స్పృహ కోల్పోయి కింద పడగా స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అతడిని లేపి సపర్యలు చేయడంతో ఆ తర్వాత తేరుకున్నాడు. సమాచారం అందుకున్న పాల్వంచ రూరల్ ఆర్‌ఐ హచ్యా ఘటన స్థలానికి వెళ్లి మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు.

బెల్ట్ దుకాణాల్లో తనిఖీలు


స్వాధీనం చేసుకున్న మద్యంతో అధికారులు

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బెల్ట్ దుకాణాలపై ఫ్లయింగ్ స్క్వాడ్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గురువారం మండలంలోని కొత్త మామిళ్ల వారిగూడెం, సూర్యంపేట, నారాయణపురం గ్రామాల్లో తనిఖీలు చేపట్టి రూ.30 వేల విలువైన 60 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. ముగ్గురు బెల్ట్ దుకాణదారులపై కేసు నమోదు చేశారు. తెలంగాణ, ఏపీ ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో సరిహద్దు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం పంతంగులవారిగూడెం గ్రామంలోని ఓ తోటలో నిల్వ ఉంచిన 250 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎల్.కృష్ణ, అశ్వారావుపేట ఎక్సైజ్ ఎస్‌ఐలు రాజేశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మహిళపై దాడి

అన్నపురెడ్డిపల్లి: మహిళను లైంగికంగా వేధించి, దాడి చేసిన వ్యక్తిపై గురువారం పోలీసుల కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పెంట్లం గ్రామానికి చెందిన ఈలప్రోలు లక్ష్మి భర్త చనిపోగా ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఆమె ఇంటి పక్కనే నివసిస్తున్న బత్తుల వెంకన్న నెల రోజులుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ నెల 5న బూతులు తిడుతూ, తన కోరిక తీర్చమని గొడవకు దిగాడు. లక్ష్మి ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

స్ప్రేకొట్టి బంగారు గాజులు చోరీ

తల్లాడ: తల్లాడ రింగ్ రోడ్ సెంటర్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..... తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో నేరెళ్ల రాధిక తన ఇంటి ఎదుట కూర్చుంది. ఇంతలో వెనక నుంచి తలుపులు పగులగొట్టుకొని ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తి ఆపై స్ప్రే కొట్టడంతో స్పృహ కోల్పోయింది. దీంతో రాధిక చేతికి ఉన్న రూ.1.50లక్షల విలువైన మూడు తులాల బంగారు గాజులు లాక్కుని పారిపోయాడు. ఈమేరకు తేరుకున్న అనంతరం ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎనిమిది పాడి గేదెలు..


మృతి చెందిన గేదెల వద్ద గ్రామ రైతులు

కొణిజర్ల: గాలిదుమారం కారణంగా తెగిపడిన ఎల్‌టీ విద్యుత్ వైరును తాకడంతో ఎనిమిది పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. మండలంలోని గద్దలగూడెంలో గురువారం చోటుచేసుకున్న ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. గ్రామ రైతులు కంచెర్ల బసవయ్య, గుడిపూడి రాజేశ్వరరావు, ఎలగల శ్రీను, జెట్టి అప్పారావు, చీకటి నరసింహారావుతో పాటు పలువురు రైతుల పాడి గేదెలను సమీపంలోని వరి పొలాల్లో మేతకు వదిలారు. అయితే, బుధవారం సాయంత్రం ఈదురు గాలుల కారణంగా తెగిపడిన విద్యుత్ తీగను తాకిన ఎనిమిది గేదెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన సాయిలు మిగిలిన గేదెలను అదిలించడంతో అవి ప్రాణాలతో బయటపడ్డాయి. మృతి చెందిన గేదెల్లో జెట్టి అప్పారావుకు చెందినవే నాలుగు ఉండగా, మిగిలిన రైతులవి ఒక్కొక్కటి మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.7లక్షల వరకు ఉంటుందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

ఏసీ అంబులెన్స్ ఇవ్వలేదని ఆందోళన


సింగరేణి ప్రధాన ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న యూనియన్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న మహిళను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించేందుకు ఏసీ అంబులెన్స్ ఇవ్వలేదంటూ సింగరేణి ఆస్పత్రి వద్ద కార్మిక సంఘాల నాయకులు గురువారం రాత్రి ఆందోళన చేశారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహించే భూక్యా శ్రీనివాస్ భార్య లీలావతికి హార్ట్ ప్రాబ్లమ్ ఉంది. ఈ మేరకు ఈనెల 8న సింగరేణి ప్రధాన ఆస్పత్రికి తీసుకురాగా, హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయితే ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఆస్పత్రి యాజమాన్యం ఏసీ అంబులెన్స్ ఇవ్వకుండా నాన్ ఏసీ అంబులెన్స్‌లో తీసుకెళ్లండని అధికారులు తెలిపారు. హార్ట్ పేషెంట్ అయినందున ఏసీ అంబులెన్స్ ఇవ్వాలని కోరినా ఆస్పత్రి నిర్వాహకులు తాత్సారం చేస్తున్నారంటూ గురువారం రాత్రి బీఎంఎస్ నాయకులు మాధవనాయక్, కృష్ణారెడ్డి, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు వంగా వెంకట్, రమణమూర్తి, పీతాంబరం, ఎం ప్రభాకర్ రావు ఆందోళన చేశారు. ఈ విషయం తెలిసిన ఆస్పత్రి యాజమాన్యం ఏసీ అంబులెన్స్‌తో పాటు అంటెండర్‌ను పంపించింది. అయితే ఆందోళనకారులతో సంప్రదించకపోవడంతో వారు అర్ధరాత్రి వరకూ ఆందోళన కొనసాగించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని సీఎంఓ హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్యాస్ సిలిండర్ల ట్రాలీ దగ్ధం


కిందకు దించిన సిలిండర్లు, దగ్ధమవుతున్న ట్రాలీ

టేకులపల్లి: ఇంజిన్‌లో మంటలు చెలరేగి గ్యాస్ సిలిండర్ల ట్రాలీ దగ్ధమైన సంఘటన గురువారం జరిగింది. ఇల్లెందులోని తేజస్విని గ్యాస్ ఏజెన్సీకి చెందిన ట్రాలీ గురువారం బిల్లుడుతండా సమీపంలో గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసి మంగలితండా వెళ్తోంది. ఈ క్రమంలో బ్రిడ్జి సమీపంలోకి వెళ్లగానే ట్రాలీ ఇంజిన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడి మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ చక్రి, హెల్పర్ శ్రీకాంత్ తక్షణమే వాహనాన్ని బ్రిడ్జిపై నిలిపి ట్రాలీలో ఉన్న 20 నిండు, 20 ఖాళీ సిలిండర్లను కిందకు దింపి కొద్ది దూరంలో ఉంచారు. కాగా వాహనంతోపాటు అందులో ఉన్న సుమారు రూ.30 వేల నగదు కూడా మంటల్లో కాలిపోయింది. వాహన దగ్ధంతో యజమానికి రూ.లక్షల్లో నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నామినేషన్ వేసిన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి


నామినేషన్ సమర్పిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో ఆయన నామినేషన్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు.. కన్నీరు

- ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారుల మృతి
- మృత్యుకుహరంగా మారిన హైవే పిల్లర్ గుంత
- బడుగుల కుటుంబాల్లో పెనువిషాదం


లోకేష్, హరీష్ మృతదేహాలు

ఖమ్మంఅర్బన్: పొట్ట నింపుకునేందుకు పల్లెల నుంచి జిల్లా కేంద్రానికి వలస వచ్చిన కుటుంబాల్లో పెనువిషాదం చోటుచేసుకుంది. వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉంటున్న పిల్లలను సరదాగా ఈతకు తీసుకెళ్లిన తండ్రి కళ్లెదుటే ఇద్దరు చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడిన వీరి వెంట వెళ్లిన మరో బాలుడూ కన్నుమూశాడు. ఖమ్మంలోని ధంసలాపురం సమీపాన మున్నేరులో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకోగా రెండు నిరుపేద కుటుంబాల్లో తట్టుకోలేని విషాదం నెలకొంది.

పిల్లలతో ఈతకు...

ఏన్కూరు మండలం జన్నారానికి చెందిన ఆముదాల చిరంజీవి తన భార్య, ఇద్దరు కుమారులు లోకేష్(14), హరీష్(12)తో కలిసి ఖమ్మం రామచంద్రయ్య నగర్‌కు పదేళ్ల క్రితం వచ్చాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరిలో లోకేష్ భద్రాచలంలోని గురుకులంలో, హరీష్ రోటరీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలిద్దరిని చిరంజీవి ధంసలాపురం వద్ద మున్నేరులో ఈతకు తీసుకెళ్లాడు. వీరితో పాటు సమీపాన నివాసముంటే బానోతు కళావతి చిన్నకుమారుడు గణేష్(13) కూడా వెళ్లాడు. అక్కడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పిల్లర్ల కోసం గుంతలు తీయగా కొన్ని పిల్లర్లు నిర్మించినా.. ఇంకొన్ని గుంతలు తీసి వదిలేశారు. అందులో చేరిన మున్నేరు నీటిలో పిల్లలు ఈత కొడుతున్నారు. ఇంతలోనే పిల్లలు ముగ్గురు నీటి అడుగు భాగానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన చిరంజీవి కుటుంబీకులు సమాచారం ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

రెండు గంటల పాటు గాలింపు

చిరంజీవి ఇచ్చిన సమాచారంతో బంధువులు, రామచంద్రయ్య నగర్ వాసులు పెద్దసంఖ్యలో ధంసలాపురం చేరుకున్నారు. నీటిలో చిన్నారులు మునిగిపోయిన విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వగా తొలుత నగర ఏసీపీ రమణమూర్తి, ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ సిబ్బందితో చేరుకున్నారు. కానీ ఘటన జరిగిన ప్రాంతం ఖమ్మం రూరల్ పీఎస్ పరిధిలో ఉండడంతో వారికి కూడా సమాచారం ఇవ్వగా అగ్నిమాపక శాఖ సిబ్బందితో సహా వచ్చారు. ఈమేరకు గుంతలో మునిగిపోయిన పిల్లల కోసం గాలించగా తొలుత చిరంజీవి కొడుకు లోకేష్, గణేష్ మృతదేహాలు బయటపడ్డాయి. ఆపై రెండు గంటల పాటు గాలించినా హరీశ్ మృతదేహం ఆచూకీ లేకపోవడంతో రెండు ఇంజన్లు తప్పించి నీటిని తోడగా రాళ్ల మధ్యలో చిక్కుకున్న ఆయన మృతదేహం బయటపడింది. అంతసేపు మున్నేరు వద్దే కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉండిపోయారు. ఆతర్వాత మృతదేహాలను ఖమ్మం పెద్దాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.


మున్నేరు వద్ద పిల్లర్ గుంతలో మృతదేహాల కొనసాగుతున్న గాలింపు

నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంతోనే...

జిల్లాలో కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణం ధంసలాపురం మున్నేరు మీదుగా వెళ్తోంది. ఈక్రమాన పిల్లర్ల నిర్మాణానికి గుంతలు తీయగా కొన్నిచోట్ల నిర్మాణం చేపట్టిన, ఇంకొన్ని చోట్ల వదిలేశారు. భారీ స్థాయిలో తీసిన గుంతల్లో నీరు చేరడమే ఇప్పుడు ముగ్గురు పిల్లల మృతికి కారణమైన వారి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈమేరకు నిర్మాణ సంస్థ ప్రతినిధులపై బాధిత కుటుంబాలు ఫిర్యాదు చేశాయని ట్రైనీ ఏసీపీ మౌనిక వెల్లడించారు.

రెక్కల కష్టంపై జీవనం

రఘునాథపాలెం మండలం రాంక్యా తండాకు చెందిన బానోత్ కళావతి తన భర్త ఇద్దరు పిల్లలతో కలిసి రాంచంద్రయ్య నగర్‌కు వలస వచ్చింది. సుతారీ పని చేసే ఆమె భర్త పదేళ్ల క్రితం మృతి చెందినా ఇళ్లలో పనిచేస్తూ రెక్కల కష్టంపై గణేష్‌తో పాటు ఆయన అన్న ప్రవీణ్‌ను చదివిస్తోంది. మృతుడు గణేష్ ఇటీవల మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి పరీక్ష రాసి అర్హత సాధించగా.. జూన్‌లో చేర్పించాలని అనుకున్నారు. ఇంతలోనే గణేష్ మృతి చెందడంతో కళావతి రోదనలకు అంతు లేకుండాపోయింది.

పక్క ఇంట్లో ఆడుకుంటానని వెళ్లి...

గురువారం మధ్యాహ్నం భోజనం చేశాక పక్క ఇంట్లో ఆడుకుంటానని గణేష్ తన తల్లి కళావతికి చెప్పి వెళ్లాడు. ఈతకైతే వెళ్లనివ్వదని అలా చెప్పినట్లు తెలుస్తోంది. తీరా నీట మునిగి గణేష్ మృతి చెందినట్లు సమాచారం అందడంతో కళావతి అక్కడకు చేరుకుని కొడుకు మృతదేహంపై పడి రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.


పెద్దాస్పత్రిలో రోదిస్తున్న హరీష్, లోకేష్ తల్లి

ఇసుక ట్రాక్టర్ సీజ్

అన్నపురెడ్డిపల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం మండలంలోని కట్టుగూడెం గ్రామంలో పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సర్దార్, ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

వృద్ధురాలి మృతి


వీరమ్మ (ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన వృద్ధురాలు యంపల్ల వీరమ్మ(100) గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరమ్మ మృతదేహానికి స్థానికులు, బంధువులు నివాళులు అర్పించారు.

4 కేజీల గంజాయి స్వాధీనం

పెనుబల్లి: మండలంలోని వీఎం బంజర్ వద్ద గురువారం చేపట్టిన వాహన తనిఖీల్లో 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. వీఎం బంజర్ సమీపాన పెట్రోల్ బంక్ వద్ద తనిఖీలు చేపట్టగా లంకపల్లి గ్రామానికి చెందిన బోయిన వెంకటరమణ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో ఆయన వద్ద పరిశీలించగా గంజాయి లభించడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం..

భద్రాచలంఅర్బన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం సీఐ సంజీవరావు కథనం ప్రకారం.. మణుగూరు నుంచి అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చట్టి గ్రామానికి రెండు వాహనాల్లో తరలిస్తున్న 30 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

మద్యం సీజ్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఉన్న ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పోలీసులు గురువారం పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సుమారు 6 లీటర్ల మద్యం నిల్వ చేయగా, గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంజీవరావు తెలిపారు.

క్లుప్తంగా

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్న దాన కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భక్తులు గురువారం విరాళం అందచేశారు. చుంచుపల్లికి చెందిన గద్దె ప్రమీల రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందచేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగి లింగాల సాయిబాబు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో ఎన్నికల అధికారులు



భద్రాచలం ఆలయంలో ఐఆర్ఎస్ అధికారి ఉమాకాంత్, తదితరులు

భద్రాచలం/దుమ్ముగూడెం: భద్రాచలం, పర్ణశాలలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని లోక్‌సభ ఎన్నికల పరిశీలకులు గురువారం దర్శించుకున్నారు. ఐఏఎస్ అధికారి రచిత్ రాజ్, ఐఆర్ఎస్ అధికారి ద్రుపాటి ఉమాకాంత్ భద్రాచలంలో స్వామిని దర్శించుకోగా... రచితరాజ్ పర్ణశాలలో కూడా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈసందర్భంగా వారికి అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి పూజలు చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఏఎస్పీ పరితోజ్ పంకజ్, ఆర్డీఓ దామోదర్ రావు, ఆర్ఐ బుద్దా నర్సింహారావు, తహసీల్దార్ కె.చంద్రశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో...

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కిన్నెరసానిని మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల పరిశీలకుడు రచిత్‌రాజ్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా కిన్నెరసానిలో డీర్‌పార్క్‌లో దుప్పులు, పర్యావరణ కేంద్రంలోని జంతువుల బొమ్మలను పరిశీలించాక జలాశయంలో బోటుషికారు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, మైనింగ్ ఏడీఈ దినేష్, రేంజర్ శ్రీనివాసరావు, ఆర్ఐ హచ్యా పాల్గొన్నారు.


బోదకాలు వ్యాధి నివారణే లక్ష్యం



వైద్యులు, సిబ్బందితో సమీక్షిస్తున్న డబ్ల్యూహెచ్ఓ బృందం

కామేపల్లి: బోదకాలు వ్యాధిని పూర్తి స్థాయిలో నివారించటమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు డబ్ల్యూహెచ్ఓ కన్సలెంట్ డాక్టర్ శిరీష తెలిపారు. కామేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డబ్ల్యూహెచ్ఓ వైద్య బృందం సందర్శించింది. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ బోదకాలు బారిన పడితే జీవితాంతం మోయాల్సిందేనని.. సరైన ప్రణాళికతోనే వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. బోదకాలు బాధితులు సరైన చికిత్స తీసుకుంటూ జాగ్రత్తలు వహించాలని సూచించారు. అంతేకాక ప్రతిఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన, ఉద్యోగులు బొజ్యా, వెంకట్రావు, వెంకట్‌రెడ్డి, దూప్‌సింగ్, ఉమామహేశ్వరరావు, రమాదేవి, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన



అధ్యాపకుల బోధనను పరిశీలిస్తున్న పీఓ

భద్రాచలం: పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా బోధించేందుకు ఉపాధ్యాయ విద్యార్థులకు సిద్ధం చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని గిరిజన సంక్షేమ శాఖ డీఈడీ కాలేజీలో గెస్ట్, కాంట్రాక్ట్ కాంట్రాక్ట్ లెక్చరర్లను వచ్చే విద్యా సంవత్సరం కొనసాగించడానికి గాను గురువారం డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులను ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దేలా అధ్యాపకులు వారి సబ్జెక్టుల్లో నిష్ణాతులై ఉండాలని తెలిపారు. ఈమేరకు పాఠ్యాంశాలతో పాటు ప్రాక్టికల్, టీచింగ్ ప్రాక్టీస్ విభాగాల్లో వారిని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, డీఈఓ వెంకటేశ్వరాచారి, ఏఎంఓ నాగరాజు శేఖర్, బీఈడీ, డీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు వీరూనాయక్, భవాని, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడబ్ల్యూఓ నర్సింహారావు పాల్గొన్నారు.

భూమి బలం ఎంత..?!

- భూసార పరీక్షలకు ప్రభుత్వం ప్రాధాన్యత
- మట్టి నమూనాల సంఖ్య పెంచేలా ప్రణాళిక
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు కేంద్రాలు
- ఫలితాల ఆధారంగా జాగ్రత్తలు పాటిస్తే తగ్గనున్న సాగు ఖర్చు



ఖమ్మంలోని భూసార పరీక్షా కేంద్రం



మట్టి పరీక్ష చేస్తున్న వ్యవసాయాధికారి



మట్టి నమూనాలు సిద్ధం చేస్తున్న ఉద్యోగి

ఖమ్మంవ్యవసాయం: భూసార పరీక్షలకు ప్రాధాన్యం పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పంటల సాగులో సమగ్ర ఎరువుల వినియోగం.. తద్వారా అధిక దిగుబడి, వ్యయం తగ్గింపునకు భూసార పరీక్షలు దోహదపడతాయి. అలాగే, అధిక దిగుబడి కోసం రైతులు విచ్చలవిడిగా వినియోగించే ఎరువులు వినియోగానికి కట్టడి పడనుంది. ఇలా భూసార పరీక్షలతో అనేక ప్రయోజనాలు ఉండటంతో ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఏటా వేసవిలో మార్చి నుంచి జూన్ వరకు భూసార పరీక్షలు నిర్వహిస్తుండగా.. గతంలో ఎన్ఎంఎస్ఏ(నేషనల్ మిషన్ ఫర్ సస్టైయినబుల్ అగ్రికల్చర్) పథకం ద్వారా ఒక్కో మట్టి నమూనా పరీక్షకు రూ.186 చెల్లించేవారు. వ్యవసాయ శాఖ నిర్దేశించిన ప్రాంతాలకు సంబంధిత అధికారులు వెళ్లి రైతుల క్షేత్రాల్లో మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాక రైతులకు ఫలితాలతో కార్డులు ఇచ్చేవారు. అయితే, 2019 తర్వాత ఈ పథకం నిలిచిపోయింది. దీంతో భూసార పరీక్షల భారం రైతులపైనే పడుతుండగా.. తమ క్షేత్రాల్లో మట్టి నమూనాలను తీసుకెళ్లి రూ.10 చెల్లించి పరీక్ష చేయించుకుంటున్నారు. అయినా ఎక్కువ మంది అన్నదాతలు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

నాలుగు కేంద్రాల్లో పరీక్షలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు భూసార పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. రెండు జిల్లాలకు సంబంధించి భూసార పరీక్షా కేంద్రం(స్టాటిక్ ల్యాబ్) ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో ఉండగా.. ఇక్కడ మట్టి పరీక్షలతో పాటు నీరు, విత్తనాల పరీక్షలు కూడా నిర్వహిస్తారు. అయితే, ఇక్కడ ఒక ఏడీఏ, నలుగురు ఏఓలకు గాను ఒక ఏడీఏ, ఒక ఏఓ మాత్రమే ఉన్నారు. ఇది కాక ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి మార్కెట్, భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఇంకో మూడు భూసార పరీక్షా కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో కూడా సరిపడా సిబ్బంది లేరని సమాచారం.

మార్కెట్ కమిటీల ప్రోత్సాహం

ఈ ఏడాది మార్కెట్ కమిటీలు భూసార పరీక్షలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. మార్కెట్ కమిటీల ద్వారా ఒక్కో భూసార పరీక్షా కేంద్రానికి రూ.7.20 లక్షల నిధులు మంజూరు చేశాయి. ఈ నిధులతో 2,400 భూసార పరీక్షలు నిర్వహించాలని నిర్దేశించారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం మార్కెట్ల పరిధి రైతులకు ప్రయోజనం చేకూరనుంది. కాగా, భూసార పరీక్షల్లో వచ్చే ఫలితాల ఆధారంగా సాగుకు అవకాశమున్న పంటల వివరాలు, అందులో ఉపయోగించాల్సిన ఎరువుల మోతాదు తెలిసిపోతుంది. ఫలితంగా రైతులు అధిక ఖర్చుల బారి నుంచి బయటపడతారని చెబుతున్నారు.

మినీ కిట్లు కూడా..

ప్రభుత్వం సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా మినీ సాయిల్ టెస్టింగ్ కిట్లతో భూసార పరీక్షలను అందుబాటులోకి తీసుకురానుంది. గతంలో డీసీసీబీ కార్యాలయంలో భూసార పరీక్షా కేంద్రాన్ని కొంతకాలం నిర్వహించినా ఆతర్వాత మూసేశారు. దీంతో ఇప్పుడు సహకార సంఘాల ద్వారా భూసార పరీక్షలకు అవకాశం కల్పించనున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 12 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతుండగా.. భూసార పరీక్షా కేంద్రాలను మరింత బలోపేతం చేస్తే రైతులకు ప్రయోజనం కలిగే అవకాశముంది.

భూసార పరీక్షల ఫలితాలు కీలకం

భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయటం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ విధానం అవలంభించే రైతులు ఉత్తమ ఫలితాలు, దిగుబడులను సాధిస్తున్నారు. ప్రభుత్వం భూసార పరీక్షలకు ప్రాధాన్యత ఇస్తుండడంతో పెద్ద సంఖ్యలో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటున్నారు. – స్వరూపారాణి, ఏడీఏ, భూసార పరీక్షా కేంద్రం, ఉమ్మడి ఖమ్మం జిల్లా

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

జనరల్ అబ్జర్వర్ సంజయ్ జి.కోల్టే

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ఉద్యోగులు కృషి చేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి.కోల్టే సూచించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి గురువారం పోలీస్ పరిశీలకులు చరణ్‌జిత్‌సింగ్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వ్యయ పరిశీలకులు అరుణ్‌ప్రసాత్ కృష్ణసామి, శంకర నంద్ మిశ్రా తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్, అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా అధిఆరులు పోలింగ్‌కు 48 గంటల ముందు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం ఆరు గంటలకల్లా అన్ని పార్టీలు ప్రచారం ముగించేలా పర్యవేక్షించాలని చెప్పారు. అయితే, ఐదుగురు చొప్పున ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసుకునే వెసలుబాటు ఉంటుందని తెలిపారు. కాగా, ఈ సమయాన నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు ఉండకుండా లాడ్జీలు, హోటళ్లు కల్యాణమండపాల్లో తనిఖీలు చేపట్టాలని సూచించారు. అంతేకాక ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై దృష్టి సారించాలని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు పెంచాలని తెలిపారు. కాగా, ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ఉదయం 7నుండి సాయంత్రం 6గంటల వరకు, కొత్తగూడెం, అశ్వారావుపేటల్లో ఉదయం 7నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందనే విషయమై ప్రచారం చేయాలని సూచించారు. ఖమ్మం, భద్రాద్రి అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, వేణుగోపాల్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, సీఐఎస్ఎఫ్ అధికారులు మల్కీత్ సింగ్, మనోజ్ కుమార్, ఎస్డీసీ రాజేశ్వరి, ఆర్డీఓలు గణేష్, రాజేందర్, మధు పాల్గొన్నారు.

అడ్రస్ లేని ఆరు గ్యారంటీలు

- ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్
- మాజీ మంత్రి సత్యవతి, ఎంపీ అభ్యర్థి కవిత



ఇల్లెందులో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి, పక్కన అభ్యర్థి కవిత, హరిప్రియ, దిండిగాల తదితరులు

ఇల్లెందు: అసెంబ్లీ ఎన్నికల సమయాన అసాధ్యమైన హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇల్లెందులో గురువారం నిర్వహించిన రోడ్డుషోలో మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ దిండిగాల రాజేందర్ పాల్గొనగా.. ఇల్లెందు గోవింద్ సెంటర్ నుంచి జేకే బస్టాప్ వరకు రోడ్ షో కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయకపోగా.. బీజేపీ దేవుడి పేరిట ఓట్లు దండుకోవాలని చూస్తోందని తెలిపారు. ప్రజాసంక్షేమాన్ని అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిదని ఆరోపించారు. ఈమేరకు బీఆర్ఎస్ శ్రేణులు లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని కాంగ్రెస్, బీజేపీ తీరును ప్రజలకు వివరిస్తూ కవిత విజయానికి సహకరించాలని కోరారు. అనంతరం మాలోతు కవిత మాట్లాడుతూ తనను మరోమారు గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో గళం ఎత్తుతానని తెలిపారు. ఎన్నికల్లో తనను గెలిపించడం ద్వారా మాజీ సీఎం కేసీఆర్‌కు కానుక ఇవ్వాలని కోరారు. నాయకులు ఎస్.రంగనాథ్, పరుచూరి వెంకటేశ్వర్లు, సిలివేరు సత్యనారాయణ, శీలం రమేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మరోమారు మోసానికి యత్నం

గుండాల: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అలవి కాని హామీలు ఇచ్చి విస్మరించిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే జరిగేదేమీ ఉండదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత తెలిపారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పర్యటించిన వారు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఏమీ అమలుకాకపోగా, మరోసారి ప్రజలను మోసం చేయడానికి ఆ పార్టీ నాయకులు వస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ బస్సు యాత్రతో వారికి భయం పట్టుకుని మంత్రులు, నాయకులు ఇష్టారీతిగా మాట్లాడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలోనే సంతోషంగా ఉన్నామని ప్రజలు గుర్తించినందున ఇంటింటికీ వెళ్లి కవితను గెలిపించేలా కృషి చేయాలని సూచించారు. ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, జెడ్పీటీసీ హన్మంతరావు, నాయకులు భవానీశంకర్, వట్టం రాంబాబు, తెల్లం భాస్కర్, రవీందర్, బాబా, పాయం నర్సింహారావు, వీరన్న, రాములు, లక్ష్మీనారాయణ, గుండ్ల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ మళ్లీ గెలిస్తే నియంత పాలనే..



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం, పక్కన ఎంపీ రేణుకాచౌదరి తదితరులు

- ఇక ఎన్నికలు ఉండవు.. రాజ్యాంగం ఎత్తేస్తారు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని, ఎంపీ రేణుకా చౌదరి

ఖమ్మంమయూరిసెంటర్: ఈ లోక్‌సభ ఎన్నికల్లో పొరపాటున మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ఇవే చివరి ఎన్నికలు అవుతాయని... రాజ్యాంగాన్ని ఎత్తివేసి ఆయన నియంతలా వ్యవహరిస్తారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి అన్నారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ఖమ్మంలో చాంబర్ ఆఫ్ కామర్స్ దిగుమతి శాఖ అధ్యక్షుడు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్మిక, వ్యాపారుల ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ ఇప్పటికే ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించడమే పరిరక్షణ మార్గమని తెలిపారు. ఒకవేళ మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి దిక్సూచిగా ఉన్న రాజ్యాంగాన్ని రద్దుచేసి, మనుధర్మ రాజ్యాంగాన్ని తీసుకొస్తారని చెప్పారు. అందరికీ ఇళ్లు, అర్హులకు ఉద్యోగాలు, రైతులకు మూడింతల మద్దతు ధరపై ఇచ్చిన హామీలన్నీ విస్మరించారని ఆరోపించారు. ఈ హామీల అమలుతో పాటు బీసీ కులగణన చేపట్టి, అన్ని వర్గాల వారికి పూర్తిస్థాయిలో రిజర్వేషన్లు కల్పించేలా కాంగ్రెస్‌కు వామపక్షాలు పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతున్నాయని ఆయన వెల్లడించచారు. ఎంపీ రేణుకాచౌదరి మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నందున ఓటు ద్వారా బీజేపీ ప్రభుత్వాన్ని కూల్చివేయాలని పిలుపునిచ్చారు. అనంతరం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ తనకు ఓసారి అవకాశమిస్తే ప్రజాసేవల చేసుకుంటానని తెలిపారు. ఆతర్వాత ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడగా సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు కాంగ్రెస్, సీపీఎం నాయకులు, ప్రజాప్రతినిధులు పొంగులేటి ప్రసాదరెడ్డి, తుమ్మల యుగేందర్, బాలసాని లక్ష్మీనారాయణ, భాగం హేమంతరావు, యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, మానుకొండ రాధాకిషోర్, యర్రా శ్రీనివాసరావు, తుశాకుల లింగయ్య, భూక్యా శ్రీనివాసరావు, మద్ది శ్రీనివాసరెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి, యర్రా గోపి, యల్లంపల్లి వెంకట్రావు, బండారు యాకయ్య పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీని ఓడించాలి..

కాంగ్రెస్ నాయకులు పిడమర్తి రవి, సోమచంద్రశేఖర్



మాట్లాడుతున్న పిడమర్తి రవి, పక్కన వక్కలగడ్డ తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: పదేళ్లుగా అధికారంలో ఉండి ఎస్సీ వర్గీకరణ చేయని మతతత్వ పార్టీ బీజేపీని ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓడించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు పిడమర్తి రవి, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ కోరారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ రాజ్యాంగాన్ని ప్రసాదించి బహుజనులకు రిజర్వేషన్లు వర్తింపచేసిందని తెలిపారు. కానీ ఇప్పుడు దళితులు, గిరిజనులు, మైనార్టీలు, బహుజనులకు రిజర్వేషన్లు లేకుండా చేయాలని బీజేపీ కుట్ర పన్నిందని విమర్శించారు. కాగా, మనువాద పార్టీ బీజేపీకి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ మద్దతు ఇవ్వడం గర్హనీయమని వారు పేర్కొన్నారు. మాదిగలకు సరైన ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన నేపథ్యాన గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్న మాదిగలు ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించి ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు యాదయ్య, ఎం.నర్సింహారావు, జోగారావు, మల్లికార్జున్, గణేష్, బాబురావు, మహేష్, నరేష్, మురళి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- ఎన్నికల్లో లబ్ధి కోసం కుట్ర
- మానుకోట బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్
- మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డితో కలిసి ఇల్లెందులో ప్రచారం



రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, పక్కన అభ్యర్థి సీతారాంనాయక్

ఇల్లెందు/భద్రాచలం టౌన్: ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ రిజర్వేషన్ల తొలగిస్తుందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్ విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లో బీజేపీకి రిజర్వేషన్లు ఎత్తివేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఇల్లెందులోని గోవింద్ సెంటర్ నుంచి జగదాంబా సెంటర్ వరకు గురువారం నిర్వహించిన రోడ్ షోతో పాటు భద్రాచలంలో నిర్వమించిన వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన అవినీతిమయంగా కొనసాగగా.. పదేళ్ల బీజేపీ పాలన మాత్రం మోదీ నేతృత్వాన మచ్చ లేకుండా ఉందని తెలిపారు. అందుకే మరోమారు బీజేపీని గెలిపించేందుకుప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, మెడికల్ కాలేజీలు,, ఎయిమ్స్ ఏర్పాటు, ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్, ఫసల్ బీమా యోజన వంటి అనేక పథకాలను అన్నివర్గాల ప్రజలకు కేంద్రప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని వివరించారు. కాగా, బీఆర్ఎస్‌లో ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేశారని.. ఎంపీలుగా ప్రాంతీయ పార్టీ అభ్యర్థులు గెలిచినా లాభముండదని చెప్పారు. ఈమేరకు కేంద్రంలో మరోమారు మోదీ అధికారంలోకి రానున్నందున మహబూబాబాద్ స్థానం నుంచి కూడా సీతారాంనాయక్‌ను గెలిపిస్తే అభివృద్ధి చకచకా సాగుతుందని తెలిపారు. ఈమేరకు ఓటర్లు సరైన నిర్ణయం తీసుకుని బీజేపీకి ఓటు వేస్తే వచ్చే ఐదేళ్ల కాలంలో మోదీ నేతృత్వాన అభివృద్ధి కొనసాగుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో బీజేపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్, నాయకులు ముసుగు శ్రీనివాసరెడ్డి, అశోక్‌రెడ్డి, బలగానీ గోపీకృష్ణ, ఆకుల నాగేశ్వరరావు, కొల్లి సంజీవరెడ్డి, మురళీకృష్ణ, సుచిత్ర, సునీత, గుండెబోయిన నాగమణి, త్రినాథ్‌రావు, కుంజా ధర్మా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రంగంలో కుటుంబాలు..



కొణిజర్ల : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి



ముదిగొండ : బజ్జీలు వేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నామా కుమారులు

లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు ప్రచారంలో తలమునకలయ్యారు. ఇదే సమయాన అభ్యర్థుల కుటుంబీకులు కూడా రంగంలోకి దిగారు. ఈమేరకు ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ కొణిజర్ల మండలం పెద్దమునగాలలో గురువారం ఆయన చిన్న కుమారుడు అర్జున్‌రెడ్డి, పెద్దకోడలు ఆశ్రిత, చిన్న కోడలు సప్నిరెడ్డి ప్రచారం నిర్వహించారు. చెరువు వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు పరికపల్లి శ్రీనివాసరావు, కొంగర జ్యోతిర్మయి, జ్యోతి, దాసరి వీరబాబు, ఎల్లయ్య, పిట్టల రాంబాబు, కవిడ వెంకన్న, చింతల మల్లయ్య, తలారి చందు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఇక ముదిగొండలో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు తనయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈమేరకు ముదిగొండ సెంటర్‌లో ఓ షాపు వద్ద కాసేపు బజ్జీలు వేసి నామాను గెలిపించాలని కోరారు. ఆయన కుమారులు నామ పృథ్వీతేజ, భవ్యతేజ, కుటుంబ సభ్యుడు సాయిరాంతో పాటు నాయకులు ఎర్ర వెంకన్న, తోట ధర్మ, తదితరులు పాల్గొన్నారు. – కొణిజర్ల/ముదిగొండ

ఎంపీని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి



ఎంపీ రేణుకాచౌదరితో తీన్మాన్ మల్లన్న

ఖమ్మంవన్‌టౌన్: రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిని ఖమ్మం, వరంగల్, నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్‌కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న గురువారం ఖమ్మంలో కలిశారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల ప్రచార తీరుతెన్నులు, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. నాయకులు మానుకొండ రాధాకిషోర్, ఎండీ.ముస్తఫా తదితరులు పాల్గొన్నాన్నారు.

భారీ'మీనం'!



చింతకాని మండలం కొదుమూరులోని రామలింగేశ్వరస్వామి చెరువులో మత్స్యకారులు కొద్దిరోజులుగా చేపలు పడుతున్నారు. ఈనేపథ్యాన గురువారం ఓ మత్స్యకారుడి వలకు భారీ రవ్వ రకం చేప చిక్కింది. దీన్ని బయటకు తీసుకొచ్చి తూకం వేయగా 20 కేజీలు ఉంది. ఈ చెరువులో ఎన్నడూ మూడు కేజీలకు మించి బరువైన చేపలు పడలేదని మత్స్యకారులు తెలిపారు.

– చింతకాని

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 371/A/AA, Thanikella Village, Konijerla Mandal, Khammam Dist - 507 305, T.G., and Printed at Jagati Publications Limited, Survey No. 371/A/AA, Thanikella Village, Konijerla Mandal, Khammam Dist - 507 305, T.G., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08742-282823 - 24, Fax No.08742 - 282825, RNI Regn No. TEL TEL/2008/23797.